# అధ్యాయం-3

## ఎస్సీ, ఎస్టీ, బీసీ, అల్పసంఖ్యాకవర్గాల విద్యార్థులకు ఉద్దేశించిన స్కాలర్‌షిప్ పథకాలపై ఆడిట్ సమీక్ష

సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతులు మరియు అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖలు


పేజీలు 45 - 76

## 3.1 పరిచయం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరంభించిన ఈ స్కాలర్‌షిప్ పథకాలు ఒక ముఖ్యమైన సాంఘిక సంక్షేమ కొలమానానికి ప్రతీక. షెడ్యూల్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్ తెగలు (ఎస్టీ), వెనుకబడిన తరగతులు (బీసీ), మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులను విద్యా సంస్థల్లో చదువు కొనసాగించేలా చేయడం, ఆయా విద్యార్థుల భర్తీ సంఖ్యను పెంచడం ఈ పథకాల ఉద్దేశం. సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, మైనారిటీల సంక్షేమ శాఖల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోంది. ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సమయానుసారంగా నిర్దేశించే పరామితుల ఆధారంగా ఈ పథకాల ప్రయోజనాలను అందించడం జరుగుతోంది. పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాల కింద ప్రతి ఏటా సుమారుగా 25 లక్షల లబ్ధిదారులు ప్రయోజనాన్ని పొందుతున్నారు. ఈ పథకాలపై 2008-12 మధ్యగల నాలుగేళ్ల కాలంలో ₹9,369 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేసారు.

### 3.1.1 సంస్థాగత నిర్మాణం

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సంబంధించి విద్యా, ఇతర సంక్షేమ పథకాల అమలుపై పూర్తి నియంత్రణను ఆయా సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులు కలిగి ఉంటారు. వివిధ స్కాలర్‌షిప్ పథకాల అమలుకు సంబంధించి ఆయా శాఖలలోని సంస్థాగత నిర్మాణం ఈ కింది విధంగా ఉంది:



## 3.2 ఆడిట్ విధివిధానాలు

### 3.2.1 ఆడిట్ లక్ష్యాలు

ఈ కింది అంశాలను పరిశీలించడం కోసం స్కాలర్‌షిప్ పథకాలను ఆడిట్ సమీక్షించింది:

- ప్రణాళికా ప్రక్రియ సమగ్రంగానూ, పటిష్ఠంగానూ ఉందా;
- నిధుల విడుదల, వాటి వినియోగంతోపాటుగా మొత్తం ఆర్థిక నిర్వహణ సమర్థవంతంగానూ, లక్ష్యాలకు అనుగుణంగానూ ఉందా;
- పథకాలను కట్టుదిట్టంగా అమలు చేసారా, దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా ఉందా, అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను సమయానికి విడుదల చేసారా;
- వివిధ స్థాయిల్లో పర్యవేక్షణ వ్యవస్థ, అంతర్గత నియంత్రణలు చాలినంతగా ఉన్నాయా, వాటి పనితీరు ఆశించిన విధంగా ఉందా.

### 3.2.2 ఆడిట్ ప్రామాణికంగా తీసుకున్న అంశాలు

ఈ దిగువ పేర్కొన్న వాటినుండి ప్రామాణికంగా తీసుకున్న అంశాలకు ప్రతిగా ఆడిట్ పరిశీలన చేయడమైంది.

- పథకం మార్గదర్శకాలు, ప్రభుత్వం ఆయా సమయాల్లో జారీ చేసిన ఆదేశాలు;
- ఆంధ్రప్రదేశ్ ఆర్థిక నియమావళి;
- శాఖాపరమైన, కార్య నిర్వాహక నిబంధనావళులు (మాన్యువల్స్);
- బడ్జెట్ కేటాయింపులు.

### 3.2.3 ఆడిట్ పరిధి, పద్ధతి


లిఖిత రూపంలో (మాన్యువల్‌గా) జరుగుతున్న ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల మంజూరీ, చెల్లింపు ప్రక్రియను ప్రస్తుతం కంప్యూటరీకరిస్తున్నారు. పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల విషయంలో వాటి మంజూరీ, చెల్లింపులు 2007-08 సంవత్సరం వరకూ లిఖిత రూపంలోనే జరిగాయి. ఆ తరువాత ఈ మొత్తం ప్రక్రియను కంప్యూటరీకరించారు. ఆ విధంగా, 2008-09 నుండి 2011-12 మధ్య కాలంలో స్కాలర్‌షిప్ పథకాల అమలుకు సంబంధించి ప్రీ-మెట్రిక్ విషయంలో లిఖితరూప లావాదేవీలను, పోస్ట్-మెట్రిక్ విషయంలో కంప్యూటరీకరించిన లావాదేవీలను ఆడిట్ సమీక్షించడం జరిగింది.

2011 ఆగస్టు, 2012 మే మధ్యకాలంలో నిర్వహించిన క్షేత్ర స్థాయి తనిఖీలో, సచివాలయంలోని సంబంధిత పరిపాలనా శాఖలు, కమీషనర్ కార్యాలయాల రికార్డులను మచ్చుకు తనిఖీ చేయడంతో పాటు 'సామాజిక హితార్థ నిర్వహణ వ్యవస్థ' (2008-09 సంవత్సరం కోసం), 'ఈపాస్' వ్యవస్థ (2009-12 సంవత్సరాలకు) ల్లోని సమాచారాన్ని విశ్లేషించడం, ఎంపిక చేసిన 60 కళాశాలలను పరిశీలించడం జరిగింది. రాష్ట్రంలోని మూడు (కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణ) ప్రాంతాల నుండి జనాభా, అక్షరాస్యత స్థాయిల ప్రాతిపదికన ఆరు జిల్లాలను[1] ఎంపిక చేయడమైంది. ప్రతి జిల్లాలోను సమగ్ర పరిశీలన కోసం పది కళాశాలలను తీసుకోవడం జరిగింది. నిర్దిష్ట ప్రశ్నావళి రూపంలో ఆన్‌లైన్ ద్వారానూ, ఎంపిక చేసిన జిల్లాల్లోనూ లబ్ధిదారుల సర్వే నిర్వహించడమైంది. మచ్చుకు తనిఖీ కోసం తీసుకున్న జిల్లాల్లో ఎంపిక చేసిన కాలేజీ సంఖ్యల వివరాలను పటం 3.1 లో చూపడమైంది.

---

[1] చిత్తూరు, హైదరాబాదు, ఖమ్మం, రంగారెడ్డి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, విశాఖపట్నం

ఆడిట్ లక్ష్యాలు, పద్ధతులను సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులతో 2011 సెప్టెంబరులో జరిగిన సమీక్షారంభ సమావేశంలో చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకోవడమైంది. ఆడిట్ పరిశీలనలను సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులు, కమీషనర్లతో 2013 ఫిబ్రవరిలో జరిగిన సమీక్షానంతర సమావేశంలో చర్చించడం జరిగింది. వారి స్పందనలు, లిఖితపూర్వక సమాధానాలను నివేదికలో అవసరమైన చోట్ల చేర్చడమైంది.




పటం - 3.1 మచ్చుకు ఎంపిక చేసుకున్న జిల్లాలు

**గమనిక:** బ్రాకెట్లలోని సంఖ్యలు సాంఘిక/గిరిజన/వెనుకబడిన తరగతులు (బీసీ)/ అల్ప సంఖ్యాక వర్గాల (మైనారిటీల) సంక్షేమ శాఖల పరిధిలోని కళాశాలల సంఖ్య

## *ఆడిట్‌లో కనుగొన్న అంశాలు*

## 3.3 ప్రణాళికా రచన

### 3.3.1 లబ్ధిదారుల గుర్తింపు

పలు దశాబ్దాలుగా స్కాలర్‌షిప్ పథకాలు అమలౌతున్నప్పటికీ, 2008 జూలైలో, ఈ పథకాలను 'సంతృప్తత ప్రాతిపదికన'[2] అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విధానంలోని ఈ మార్పు మూలంగా స్కాలర్‌షిప్‌ను మంజూరు చేయడానికి ముందే అర్హులైన విద్యార్థులను గుర్తించాల్సిన అవసరం ఏర్పడింది.

స్కాలర్‌షిప్‌ను పొందే అర్హతను పరిగణించడానికి, ప్రయోజనం పొందగోరే విద్యార్థుల నుండి వారి తల్లిదండ్రుల ఆదాయ స్థాయికి సంబంధించి ధృవపత్రాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటోంది. ఈ సమాచారాన్ని వెల్లడించేందుకు అనువుగా ఒక ప్రామాణిక నమూనాను ప్రభుత్వం నిర్దేశించింది. ఐతే, నిర్దేశిత నమూనాకు కట్టుబడి ఉండేలా సంబంధిత శాఖలు చూడడంలేదని ఆడిట్ గమనించింది. అంతేకాక, చిరునామాకు రుజువు మొదలైన ఇతర వివరాలపై భరోసా కలిగించేందుకు ప్రభుత్వం వద్ద ఎలాంటి యంత్రాంగం లేదు. ఈపాస్ వ్యవస్థలో రేషన్ కార్డు సంఖ్యను నింపేందుకు ఒక కాలమ్ ఉన్నప్పటికీ, ఈ సంఖ్యను తప్పనిసరి చేయనందువలన అనేకమంది విద్యార్థులు రేషన్ కార్డు సంఖ్యలను ఆ కాలమ్‌లో నమోదు చేయడం లేదు. ఈపాస్ వ్యవస్థలోని రేషన్ కార్డు సంఖ్యలను పౌరసరఫరాల డేటాబేస్‌లోని సమాచారంతో ఆడిట్ పోల్చిచూడగా, స్కాలర్‌షిప్ డేటాబేస్‌లో పేర్కొన్న రేషన్ కార్డు వివరాలు పౌరసరఫరాల డేటాబేస్‌లో లభ్యంకాని సందర్భాలు అనేకంఉన్నాయని వెల్లడైంది. వివరాలు ఈకింద ఇవ్వడమైంది.

**పట్టిక 3.1**

| సంవత్సరం | దరఖాస్తు చేసిన విద్యార్థుల సంఖ్య | రేషన్ కార్డు వివరాలను తెలిపిన విద్యార్థుల సంఖ్య | పౌర సరఫరాల శాఖ డేటాబేస్‌లో లభ్యంకాని రేషన్ కార్డుల సంఖ్య |
|---|---|---|---|
| **2008-09** | 1540550 | శూన్యం | శూన్యం |
| **2009-10** | 2456261 | 3 | శూన్యం |
| **2010-11** | 2446265 | 1618782 | 86918 |
| **2011-12** | 2528563 | 2147685 | 128970 |

[2] 'సంతృప్తత ప్రాతిపదిక' అంటే అర్హులైన విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్ అందేలాచూడడం. ఒకవేళ ప్రస్తుత సంవత్సరంలో స్కాలర్‌షిప్ మంజూరుకాని విద్యార్థులకు తర్వాతి సంవత్సరంలో ప్రాధాన్యతనిచ్చి స్కాలర్‌షిప్‌ను మంజూరు చేస్తారు

ఆ కారణంగా, స్కాలర్‌షిప్‌ల మంజూరీ, చెల్లింపులు అర్హులైన విద్యార్థులందరికీ (మాత్రమే) జరిగాయన్న నిశ్చయానికి ఆడిట్ రాలేకపోయింది.

స్కాలర్‌షిప్ నమోదు ప్రక్రియను రేషన్ కార్డులతో ముడిపెట్టే విషయానికి సంబంధించి, మొదట్లో ఈ అంశాన్ని తప్పనిసరి చేసామని, ఐతే పలు విద్యార్థి సంఘాలు రేషన్ కార్డులు తమ వద్ద లభ్యంకావడం లేదంటూ విజ్ఞప్తి చేయడంతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం జరిగిందనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది (2013 ఫిబ్రవరి). రేషన్ కార్డులు కుటుంబ ఆదాయ వివరాలను సరిగా సూచించలేవు కాబట్టి రేషన్ కార్డు సంఖ్యకు బదులు 'మీసేవ' నుండి పొందే ఆదాయ ధృవపత్రంపై ఆధారపడడం సబబని, భవిష్యత్తులో 'ఆధార్ కార్డు' ఒక్కటే అన్ని పథకాలకు గుర్తింపుగా పనిచేస్తుందని కూడా సమీక్షానంతర సమావేశంలో పేర్కొంది.

ప్రభుత్వ వాదన సరికాదు, ఎందుకంటే పౌరసరఫరాల డేటాబేస్‌లో కులం, చిరునామా, కుటుంబ సభ్యులు, కుటుంబం ఫోటో, వార్షిక ఆదాయం, పిల్లల చదువులు, కుటుంబం కలిగి ఉన్న భూమి, ఐరిస్ మొదలైన వివరాలు ఉంటాయి. కాబట్టి, చిరునామాతోపాటుగా కులం, ఆదాయ స్థాయిలను నిర్ధారిస్తూ విద్యార్థుల అర్హతను గుర్తించడానికి ఇది దోహదకారి కాగలదు. 2010-11, 2011-12 సంవత్సరాల్లో విద్యార్థులు సమర్పించిన రేషన్ కార్డు వివరాల్లో వరుసగా ఐదు, ఆరు శాతం వివరాలు పౌరసరఫరాల డేటాబేస్‌లో లభ్యంకాని నేపథ్యంలో, లక్షిత లబ్ధిదారులను గుర్తించడానికి సరైన విధానాన్ని ప్రభుత్వం రూపొందించాల్సిన అవసరం ఉంది. దాంతోపాటుగా ఆ విధానాన్ని విధిగా అనుసరించేలా చూడాలి. ఈ అంశాన్ని, పేరా 3.4.2.4 లో వివరించినట్టుగా, అవసరమైన వివరాలు లేని కారణంగా కొన్ని సందర్భాల్లో స్కాలర్‌షిప్ మొత్తాలను విద్యార్థుల ఖాతాల్లోకి నోడల్ బ్యాంకులు జమ చేయలేకపోవడం, పేరా 3.6.5.1 లో చర్చించినట్టుగా, స్కాలర్‌షిప్‌ల కోసం వచ్చిన విద్యార్థుల దరఖాస్తులను పరిశీలించడంలో పరిశీలనాధికారులు తగిన శ్రద్ధను చూపకపోవడం అనే వాస్తవం మరింత బలపరుస్తోంది.

## 3.4 ఆర్థిక నిర్వహణ

### 3.4.1 నిధులు సమకూరే విధానం

వివిధ స్కాలర్‌షిప్ పథకాల అమలుకు నిధులు సమకూరే క్రమాన్ని ఈ కింద చూపడమైంది :

| పథకం పేరు | సాంఘిక సంక్షేమం | గిరిజన సంక్షేమం | బీసీ సంక్షేమం | మైనారిటీల సంక్షేమం |
|---|---|---|---|---|
| ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ | | | | |
| (i) మెరిట్ అప్‌గ్రెడేషన్ కోసం | 100 శాతం కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది | 100 శాతం కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది | వర్తించదు | వర్తించదు |
| (ii) అపరిశుభ్ర వృత్తులలో ఉన్న వారి పిల్లలకు స్కాలర్‌షిప్ | అంగీకరించిన మొత్తం ఖర్చును[3] 100 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. అంతకు మించి అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. | వర్తించదు | వర్తించదు | వర్తించదు |
| (iii) అత్యుత్తమ పాఠశాలలు (గిరిజన సంక్షేమం)/ఉజ్వల బాలుర పథకం (సాంఘిక సంక్షేమం) | రాష్ట్ర ప్రణాళికా పథకాలు కావడం వలన, మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. | రాష్ట్ర ప్రణాళికా పథకాలు కావడం వలన, మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. | వర్తించదు | వర్తించదు |

[3] 'అంగీకరించిన ఖర్చు' (కమిటెడ్ లయబిలిటీ) అంటే కేంద్ర ప్రాయోజిత పథకం కింద పదవ పంచవర్ష ప్రణాళిక చివరి సంవత్సరం (2006-07) లో రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన మొత్తం ఖర్చు

| పథకం పేరు | సాంఘిక సంక్షేమం | గిరిజన సంక్షేమం | బీసీ సంక్షేమం | మైనారిటీల సంక్షేమం |
|---|---|---|---|---|
| (iv) ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ (కేంద్ర ప్రాయోజిత పథకం) | వర్తించదు | వర్తించదు | అంగీకరించిన ఖర్చును రాష్ట్రమే పూర్తిగా భరించాలి. అంతకు మించి అయ్యే ఖర్చును రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో భరిస్తాయి. | కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 75:25 నిష్పత్తిలో నిధులను అందిస్తాయి. |
| (v) ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ (రాష్ట్ర పథకం) | వర్తించదు | వర్తించదు | వర్తించదు | రాష్ట్ర ప్రభుత్వమే మొత్తం నిధులను అందిస్తుంది. |
| పోస్ట్ - మెట్రిక్ స్కాలర్‌షిప్ | | | | |
| పోస్ట్ - మెట్రిక్ స్కాలర్‌షిప్ (ఎమ్‌టీఎఫ్, ఆర్‌టీఎఫ్) | అంగీకరించిన ఖర్చును 100 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. అంతకు మించి అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం భరించాలి. | అంగీకరించిన ఖర్చును 100 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. అంతకు మించి అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం భరించాలి. | అంగీకరించిన ఖర్చును 100 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. అంతకు మించి అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం భరించాలి. | ఎ) కేంద్ర ప్రాయోజిత పథకానికి 100 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వమే ఇస్తుంది. బి) రాష్ట్ర పథకానికి 100 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వమే సమకూరుస్తుంది. |

*మూలం : భారత ప్రభుత్వపు స్కాలర్‌షిప్ మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత ఉత్తర్వులు*

స్కాలర్‌షిప్ మొత్తాల మంజూరీ, వాటి విడుదలకు సంబంధించిన ప్రక్రియలు, అందుకు బాధ్యతను వహించే అధికారుల స్థాయీ వివరాలను ఈ కింద ఇవ్వడమైంది :

| ప్రక్రియ | బాధ్యత |
|---|---|
| అంచనాల తయారీ | సంబంధిత సంక్షేమ శాఖలు |
| బడ్జెట్‌కు ఆమోదం దాని విడుదల | ఆర్థిక మంత్రిత్వ శాఖ (కేంద్రం), ఆర్థిక శాఖ (రాష్ట్ర ప్రభుత్వం) |
| త్రైమాసిక బడ్జెట్‌ను ట్రెజరీలకు విడుదల చేయడం | సంబంధిత శాఖాధిపతులు |
| స్కాలర్‌షిప్ మొత్తాన్ని నోడల్ బ్యాంకులు/సీఐఎన్‌బీ అకౌంట్లకు విడుదల | ట్రెజరీలు |
| ఆర్‌టీఎఫ్ - ప్రైవేట్/ప్రభుత్వ కళాశాల అకౌంట్లకు; ఎమ్‌టీఎఫ్ - విద్యార్థుల అకౌంట్లకు/వార్డెన్ అకౌంట్లకు/కళాశాల అకౌంట్లకు మొత్తాలను జమచేయడం | బ్యాంకులు |
| వినియోగ ధృవపత్రాలను సమర్పించడం, వినియోగించని మొత్తాలను ప్రభుత్వ పద్దుకు వాపసు చేయడం | కళాశాలల అధిపతులు |
| జమా మొత్తాలను ట్రెజరీ మొత్తాలతో సరిపోల్చి చూడడం | జిల్లా సంక్షేమ అధికారి |
| ఫలించని లావాదేవీల రీకన్సిలియేషన్, దిద్దుబాటు, వాటిని రీ-ఆథరైజ్ చేయడం | ట్రెజరీలు |


### 3.4.2 బడ్జెట్, వ్యయం

స్కాలర్‌షిప్‌లపై, 2008-12 మధ్యగల నాలుగేళ్ల కాలంలో, రాష్ట్రంలో అయిన మొత్తం ఖర్చు ₹9,508 కోట్లు (ప్రీ-మెట్రిక్ : ₹139 కోట్లు, పోస్ట్-మెట్రిక్ : ₹9,369 కోట్లు). ప్రీ, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాలు,

ఆర్‌టీఎఫ్ లకు సంబంధించి 2008-09 నుండి 2011-12 సంవత్సరాల్లో మొత్తం బడ్జెట్ కేటాయింపులు, అయిన ఖర్చు వివరాలను (చార్టులు 3.1, 3.2), నాలుగు శాఖలకు సంబంధించిన వివరాలను (చార్టులు 3.3, 3.4) ఈ కింద ఇవ్వడం జరిగింది.


**చార్టు 3.1**

*ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి సంవత్సరాలవారీగా బడ్జెట్ కేటాయింపు, వ్యయం (₹ కోట్లలో)*




**చార్టు 3.2**

*పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి సంవత్సరాలవారీగా బడ్జెట్ కేటాయింపు, వ్యయం (₹ కోట్లలో)*




*మూలం : సంబంధిత సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అప్రోప్రియేషన్ అకౌంట్లు*


*గమనిక: ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన బడ్జెట్, ఖర్చులలో ఎస్సీ, ఎస్టీలకు చెందిన నిధులు మాత్రమే ఉన్నాయి. మైనారిటీలకు సంబంధించి కేటాయించిన నిధులు, అయిన ఖర్చు వివరాలను పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లో కలపడమైంది. బీసీలకు సంబంధించి సంవత్సరాల వారీగా వివరాలు లభ్యం కాలేదు*

గడచిన నాలుగేళ్లలోనూ ప్రతీ సంవత్సరాంతానికి ఈ నాలుగు సంక్షేమ శాఖలవద్ద పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి భారీ మొత్తంలో నిధులు నిరుపయోగంగా పడి ఉన్నట్టు పై చార్టుల నుండి తెలుస్తోంది. సంవత్సర వారీగా వివరాలు *అనుబంధం-3.1* లో ఉన్నాయి. ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల విషయానికొస్తే, 2008-10 మధ్య కాలంలో అయిన ఖర్చు బడ్జెట్ కేటాయింపుకు ఇంచుమించుగా సరిపోయినప్పటికీ, 2011–12 సంవత్సరంలో మాత్రం వాటి మధ్య అంతరం బాగా పెరిగింది.

పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి గడిచిన నాలుగేళ్లలో కేటాయించిన నిధుల్లో 24 శాతం మేర నిరుపయోగంగా మిగిలిపోయాయి. ప్రీ, పోస్ట్-మెట్రిక్ రెండు స్కాలర్‌షిప్ పథకాలకు సంబంధించి శాఖలవారీగా నిధుల వినియోగ స్థితిగతులను ఈకింద చూపడమైంది.


**చార్టు 3.3**

*ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి శాఖలవారీగా బడ్జెట్ కేటాయింపు, వ్యయం (₹ కోట్లలో)*




**చార్టు 3.4**

*పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి శాఖలవారీగా బడ్జెట్ కేటాయింపు, వ్యయం (₹ కోట్లలో)*




*మూలం : సంబంధిత సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అప్రోప్రియేషన్ అకౌంట్లు*

పథకాలను సమీక్షించడానికి ఆడిట్ పరిగణనలోకి తీసుకున్న నాలుగేళ్ల కాలంలో ప్రీ, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు కేటాయించిన నిధులను ఏ సంవత్సరమూ పూర్తిగా వినియోగించలేదని పై చార్టుల నుండి తెలుస్తోంది. పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లలో నిధుల కేటాయింపు, వినియోగం మధ్య 24 శాతందాకా అంతరం ఉంది. మైనారిటీ సంక్షేమ శాఖ అధికంగా మొత్తాలను వినియోగించినట్టుగా చూపడానికి, మునుపెన్నడో కేటాయించి ఆయా

సంవత్సరాల్లో ఖర్చు చేయని మొత్తాలను వినియోగించడమే కారణం. నిజానికి, ఏపీ మైనారిటీల ఫైనాన్స్ కార్పొరేషన్ స్కాలర్‌షిప్ పథకాలకు ఉద్దేశించిన నిధులను భారీగా స్తంభింప చేసింది. ఆ వివరాలను తర్వాత పేరాలో పేర్కొనడం జరిగింది.

ఇందుకు సంబంధించి, బడ్జెట్ విడుదల ఉత్తర్వులను జారీ చేసినప్పటికీ, ప్రభుత్వం విధించిన ఆర్థిక నిర్బంధనల కారణంగా కొన్ని కేసులలో బిల్లులు ట్రెజరీలో స్వీకృతం కాలేదని శాఖలు సమాధానమిచ్చాయి (2013 ఫిబ్రవరి).

పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల విషయంలో ఆర్థిక నిర్వహణకు సంబంధించి ఆడిట్ పరిశీలనలను ఈ కింద చర్చించడమైంది :

### *3.4.2.1 ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ, ఏపీఎస్‌సీఎమ్ఎఫ్‌సీ, యూఏఏపీ ల వద్ద నిరుపయోగంగా పడిఉన్న నిధులు*

ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ (మైనారిటీ) ఫైనాన్స్ కార్పొరేషన్ (ఏపీఎస్‌సీఎమ్ఎఫ్‌సీ), ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ (యూఏఏపీ) లకు నిధులను విడుదల చేస్తుంటుంది. ఈ మూడు సంస్థలు అటుపై మైనారిటీ వర్గాల (ముస్లింలు, క్రిస్టియన్లు) విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల మంజూరు, చెల్లింపుల నిర్వహణ కోసం ప్రత్యేకించి ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ నిర్వహణ వ్యవస్థ (ఓఎస్ఎమ్ఎస్) ద్వారా స్కాలర్‌షిప్‌లను చెల్లించడానికి, జిల్లా స్థాయిలోని ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ కార్య నిర్వాహక సంచాలకులకు నిధులను విడుదల చేస్తాయి.

ఐతే, ఈ సంస్థల్లోని ఏ ఒక్కటీ కూడా బడ్జెట్ అవసరాలకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపడంలేదు. ఫలితంగా, నిధుల అవసరం, ఆయా సంస్థలకు వాటిని వినియోగించే సామర్థ్యాలపై అవగాహన లేకుండానే ప్రభుత్వం బడ్జెట్‌ను కేటాయించడం, నిధులను విడుదల చేయడం చేస్తోంది. ఆ కారణంగా, 2012 మార్చి నాటికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ స్కాలర్‌షిప్ పథకాల కోసం ఇచ్చిన నిధుల్లో **₹99.60 కోట్ల** మొత్తం ఈ సంస్థలవద్ద పేరుకుపోయాయి (ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ: ₹80.70 కోట్లు, ఏపీఎస్‌సీఎమ్ఎఫ్‌సీ: ₹10.44 కోట్లు, యూఏఏపీ: ₹8.46 కోట్లు). అంతేకాకుండా, ఈ ₹99.60 కోట్లలో, ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ ₹45.51 కోట్లను ఖర్చు చేయకుండా ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉంచింది.

ఆడిట్ పరిశీలనను ప్రభుత్వం ధృవీకరిస్తూనే, లబ్ధిదారులు చేసిన క్లెయిమ్‌ల యదార్థతను పరిశీలించిన తర్వాత మాత్రమే ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ వారికి చెల్లింపులను చేస్తుందని, పరిశీలన ప్రక్రియకు సమయం పడుతుంది కాబట్టి నిధులు బ్యాంకుల్లో ఉండిపోయాయని సమాధానమిచ్చింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లలోని స్కాలర్‌షిప్ నిధుల దుర్వినియోగ అంశం సీబీసీఐడీ వద్ద పెండింగ్‌లో ఉందని ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ పేర్కొంది (2013 జనవరి).

***ఈ సంస్థల వద్ద, ముఖ్యంగా ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ వద్ద, భారీ మొత్తంలో నిధులు స్తంభించి పోవటంవలన, మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన విద్యార్థులకు నిర్ణీత సమయానికి స్కాలర్‌షిప్‌లను అందించాలన్న లక్ష్యం నెరవేరక పోవడంతో పాటూ, ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ పద్దులు బకాయిలో ఉన్నాయన్న వాస్తవం దృష్ట్యా నిధుల దుర్వినియోగం, మోసాలు జరిగే అవకాశాన్ని తోసిపుచ్చలేము. తగిన దిద్దుబాటు చర్యలు తీసుకోవడం కోసం ప్రభుత్వం ఈ అంశాన్ని నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరముంది.***

### *3.4.2.2 పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ నిధుల మళ్లింపు*

మైనారిటీల సంక్షేమ శాఖలో, ప్రీ, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ట్యూషన్ ఫీజుల భర్తీ చెల్లింపులన్నీ జిల్లా స్థాయి కార్య నిర్వాహక సంచాలకులు ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ ద్వారా నిధులను పొంది చెల్లిస్తారు. ఇందుకోసమై ప్రభుత్వం ప్రత్యేకించి ఇచ్చే నిర్వహణ సబ్సిడీ మొత్తం నుండి పాలనాపరమైన ఖర్చులను భరించాలి.

ఐతే, 2008-12 మధ్యకాలంలో మార్గదర్శకాలకు విరుద్ధంగా ₹17.47 కోట్ల పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ మొత్తాన్ని ప్రకటనలు, పాలనాపరమైన, ఇతర అవసరాలకు మళ్లించారని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. వాస్తవంలో,

ప్రభుత్వం 2008-09 నుండి 2011-12 మధ్యకాలంలో ₹3.90 కోట్లను నిర్వహణ సబ్సిడీ కింద విడుదల చేయడం జరిగింది. కాబట్టి, స్కాలర్‌షిప్ మొత్తాలను ఈ అవసరాలకు వినియోగించడం సరికాదు.

స్కాలర్‌షిప్ నిధులను ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ పాలనాపరమైన ఖర్చులకు (ప్రీ-మెట్రిక్ కోసం 1 శాతం, పోస్ట్-మెట్రిక్ కోసం 2 శాతం, ఫీజుల భర్తీ నుండి 2 శాతం చొప్పున) వినియోగిస్తోందని ప్రభుత్వం అంగీకరించింది.

### *3.4.2.3 కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులను రాష్ట్రం విడుదల చేయకపోవడం*

కేంద్ర ప్రభుత్వం ఇతర వెనుకబడిన తరగతుల విద్యార్థులకు సంబంధించి మెట్రిక్యులేషన్ స్థాయి తర్వాత విద్యాభివృద్ధి కోసం పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాన్ని 1998-99 నుండి అమలుపరుస్తోంది. ఈ పథకం కింద, 100 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వమే రాష్ట్రానికి సమకూరుస్తుంది. పదవ పంచవర్ష ప్రణాళిక చివరి సంవత్సరమైన 2006-07 లో ఈ పథకం కింద రాష్ట్రం ఎంత మొత్తాన్ని ఖర్చు చేసిందో, ఆ మొత్తం పదకొండవ పంచవర్ష ప్రణాళిక కాలంలోని ప్రతి సంవత్సరం రాష్ట్రం తన సొంత వార్షిక బడ్జెట్ నుండి సమకూర్చి, వినియోగించడానికి అంగీకరించిన మొత్తం (కమిటెడ్ లయబిలిటీ) అవుతుంది. 2012 మార్చి నాటికి పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు సంబంధించి ఈ కేంద్ర ప్రాయోజిత పథకం పరిస్థితి ఈ కింది విధంగా ఉంది :

**పట్టిక 3.2**

**(₹ కోట్లలో)**

| సంవత్సరం | కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం | ఆర్థిక శాఖ జారీ చేసిన బడ్జెట్ విడుదల ఆదేశాలలోని మొత్తం | అయిన ఖర్చు | రాష్ట్ర ప్రభుత్వం వద్ద మిగిలిపోయిన మొత్తం |
|---|---|---|---|---|
| **2008-09** | 16.77 | 9.00 | 8.34 | 7.77(46%) |
| **2009-10** | 20.35 | 16.49 | 3.35 | 3.86(19%) |
| **2010-11** | 16.93 | 13.89 | 13.12 | 3.04(18%) |
| **2011-12** | 35.45 | 0.00 | 0.00 | 35.45(100%) |
| మొత్తం | **89.50** | **39.38** | **24.81** | **50.12** |

*మూలం : బీసీ సంక్షేమ సంచాలకుల కార్యాలయం రికార్డులు*

సమీక్షా కాలంలోని ఏ సంవత్సరంలోనూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర నిధులను పూర్తిగా విడుదల చేయలేదని పై పట్టిక నుండి తెలుస్తోంది. వాస్తవానికి, 2011-12 సంవత్సరంలో, కేంద్ర నిధులు ₹35.45 కోట్ల నుండి ఒక్క పైసా కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదు.

బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మొత్తాన్ని కూడా వినియోగించలేదు. మొత్తం ₹39.38 కోట్లలో 64 శాతం మాత్రమే వినియోగించింది. అంతేకాకుండా, ఏదైనా రాష్ట్ర ప్రణాళికా పథకం అమలు జరుగు తున్నట్లైతే వాటి నిధులను ప్రత్యేకించి విడిగా ఉంచాలని స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వ నిధులను రాష్ట్ర ప్రభుత్వ నిధులలో కలిపేశారు. ఈ కేంద్ర ప్రాయోజిత పథకం కింద 2008-12 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ₹89.50 కోట్ల మొత్తానికిగాను, ₹50.12 కోట్లకు సంబంధించి బడ్జెట్ విడుదల ఆదేశాలు, పాలనాపరమైన మంజూరీలను జారీ చేయలేదు. ఐతే, ***బీసీ సంక్షేమ సంచాలకులు/ప్రభుత్వం మొత్తం ₹89.50 కోట్ల కేంద్ర ప్రభుత్వం నిధులనూ పూర్తిగా వినియోగించినట్లు చూపుతూ ధృవపత్రాలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. కానీ, వాస్తవానికి వినియోగించిన నిధులు కేవలం ₹24.81 కోట్లు మాత్రమే.***

ఇందుకు సంబంధించి ప్రభుత్వం నిర్దిష్టమైన వివరణనీయలేదు. పరిస్థితిలోని తీవ్రత దృష్ట్యా, ప్రభుత్వం ఈ అంశాన్ని సమీక్ష/దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది.

### *3.4.2.4 నోడల్ బ్యాంకులు/సీఐఎన్‌బీ ఖాతాల్లో నిధులు భారీ మొత్తంలో స్తంభించిపోవడం*

ప్రభుత్వం పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ మొత్తాలను విద్యార్థులకు ఐదు నోడల్ బ్యాంకులు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్‌బీహెచ్), ఆంధ్రా బ్యాంక్ (ఏబీ), సిండికేట్ బ్యాంక్ (ఎస్‌బీ), ఇండియన్ బ్యాంక్ (ఐబీ) ల ద్వారా చెల్లించే విధానాన్ని 2008 జూలైలో పరిచయం చేసింది. అప్పటి ప్రభుత్వ ఉత్తర్వుల (2008 జూలై) ప్రకారం, డ్రా వివరాలు, ఆపరేట్ చేయని విద్యార్థుల ఖాతాల వివరాలను కాలేజీల వారీగా ప్రతి మూడు నెలలకూ నోడల్ బ్యాంకులు జిల్లా సంక్షేమ అధికారికి సమర్పించాలి. సంబంధిత కాలేజీల్లో, విద్యార్థులు వాస్తవంగా చదువును కొనసాగిస్తున్నప్పుడు మాత్రమే నిర్వహణ చార్జీలను వారికి విడుదల చేయమంటూ బ్యాంకులకు సంక్షేమ అధికారి సూచించాలి.

ఐతే, నోడల్ బ్యాంకులు ఈ విధానం పాటించలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. నిర్దేశించిన విధంగా నోడల్ బ్యాంకులు కాలేజీలవారీగా, విద్యార్థులవారీగా ఆపరేట్ చేస్తున్న, చేయని ఖాతాల వివరాలను ప్రతి మూడు నెలలకు జిల్లా సంక్షేమాధికారికి సమర్పించకపోవడం పర్యవేక్షణ వ్యవస్థ ఆశించిన విధంగా పనిచేయకపోవటాన్ని సూచిస్తోంది. అంతేకాకుండా, సమీక్షా కాలంలో, విద్యార్థులు/ప్రిన్సిపాల్‌ల బ్యాంకు ఖాతాల్లో జమ అయిన మొత్తాలకు సంబంధించి నోడల్ బ్యాంకుల నుండి ఎలాంటి సమాచారం లేదు. 2012 ఏప్రిల్ నాటికి 2008-12 మధ్యగల నాలుగేళ్ల కాలానికి సంబంధించి ***₹176.83 కోట్ల*** మొత్తం నోడల్ బ్యాంకులు/సీఐఎన్‌బీ[4] ఖాతాల్లో నిరుపయోగంగా పడి ఉన్నాయని తనిఖీలో వెల్లడైంది. ఫలితంగా ఈ కింద చర్చించిన విధంగా పథకం అమలు దెబ్బతింది :

- బీసీ సంక్షేమ శాఖ[5] మాత్రమే అందించిన సమాచారాన్ని విశ్లేషించగా, 2008-09, 2009-10 సంవత్సరాలకు సంబంధించి **₹20.32 కోట్ల**[6] మొత్తం విద్యార్థుల/కాలేజీల బ్యాంకు ఖాతాలకు జమకాకుండా **2012 ఏప్రిల్ నాటికి కూడా నోడల్ బ్యాంకుల్లోనే** పడి ఉన్నాయి. ఆపరేట్ చేస్తున్న, చేయని బ్యాంకు ఖాతాలకు సంబంధించి సరైన సమాచారం లేకపోవడమే ఇందుకు కారణం.

  చెల్లించకుండా ఉండిపోయిన స్కాలర్‌షిప్ మొత్తాలను తిరిగి పొందేలా నోడల్ బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నామనీ, 2013 జనవరి నాటికి ₹6.46 కోట్ల మొత్తం ఇంకా బ్యాంకుల వద్దనే ఉందని ప్రభుత్వం తన సమాధానంలో తెలిపింది (2013 ఫిబ్రవరి).

- ప్రభుత్వం 2010-11 నుండి స్కాలర్‌షిప్‌లను నోడల్ బ్యాంకుల ద్వారా కాకుండా కార్పొరేట్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ (సీఐఎన్‌బీ) వ్యవస్థ ద్వారా చెల్లించే విధానాన్ని పరిచయం చేసింది. ఈ విధానంలో, జిల్లా/రెవెన్యూ డివిజన్ ప్రధాన కార్యాలయంలోని ట్రెజరీలు, అకౌంట్ల సంచాలకులు (డీటీఏ) పేరున ఎస్‌బీఐ, ఎస్‌బీహెచ్ లలో సీఐఎన్‌బీ ఖాతాలను తెరుస్తారు. జిల్లా ట్రెజరీ, మూడు (సాంఘిక, గిరిజన, బీసీ) సంక్షేమ శాఖల జిల్లా అధికారులు సమర్పించిన బిల్లులను సమ్మతించిన తరువాత నిధులను సీఐఎన్‌బీ పద్దులకు బదలాయిస్తుంది. అక్కడ నుండి ఈ మొత్తాలు నేరుగా కాలేజీలు, విద్యార్థుల ఖాతాలకు జమ అయిపోతాయి.

  ఐతే, ఖాతా సంఖ్యలు, ఐఎఫ్ఎస్‌సీ[7] కోడ్‌ల మధ్య పొంతనలేక పోవడం, డూప్లికేట్ ఖాతాలు, బ్యాంకులలో సాఫ్ట్‌వేర్/సర్వర్‌లకు సంబంధించిన సమస్యలు వంటి వివిధ కారణాల వలన పలు లావాదేవీలు విఫలం కావడంతో 2012 మార్చి నాటికి **₹156.51 కోట్లు**[8] **సీఐఎన్‌బీ ఖాతాల్లో నిరుపయోగంగా ఉండిపోయాయని** గమనించడం జరిగింది.

---

[4] కార్పొరేట్ ఇంటర్నెట్ బ్యాంకింగ్

[5] అలాంటి సమాచారాన్ని సాంఘిక, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖలు అందజేయలేదు

[6] సాంఘిక సంక్షేమం : ₹4.59 కోట్లు; గిరిజన సంక్షేమం : ₹2.80 కోట్లు; బీసీ సంక్షేమం : ₹12.89 కోట్లు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు : ₹0.04 కోటి

[7] ఇండియన్ ఫైనాన్షియల్ సిస్టం కోడ్

[8] పీడీ ఖాతాల్లో ₹56.71 కోట్లు, సీఐఎన్‌బీ ఖాతాల్లో ₹99.80 కోట్లు

అటువంటి విఫలమైన లావాదేవీలను విశ్లేషించి, సరిపోల్చి, సరైన ఆథరైజేషన్ ద్వారా ఆ మొత్తాలు తిరిగి సంబంధిత ఖాతాలకు జమ అయ్యేలా చూసేందుకున్న నియంత్రణ విధానం పనిచేయడం లేదని స్పష్టమౌతోంది. మొత్తమ్మీద, ***ఈ బ్యాంకుల వద్ద ₹176.83 కోట్ల స్కాలర్‌షిప్ నిధులు నిలిచిపోయాయి.*** అంతేకాక, మైనారిటీల సంక్షేమ శాఖకు సంబంధించి 3.4.2.1 పేరాలో చర్చించిన విధంగా, ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ ₹45.51 కోట్ల మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉంచింది.

ఈజీ పే (eZ) చెల్లింపు కార్డుల్లోని లోపాలు, బ్యాంకుల నుండి సహకారం కొరవడిన కారణంగా నోడల్ బ్యాంకులు/సీఐఎన్‌బీ ఖాతాల్లో భారీగా నిధులు నిరుపయోగంగా ఉండిపోయాయని ప్రభుత్వం తెలిపింది. మిగిలిపోయిన మొత్తాలను ప్రభుత్వ పద్దుకు తిరిగి జమచేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని కూడా తెలిపింది.

### *3.4.2.5 అవసరం లేనప్పటికీ ప్రభుత్వ కాలేజీలకు ట్యూషన్ ఫీజును మంజూరు చేయడం*

ప్రభుత్వ విద్యా సంస్థలు ట్యూషన్ ఫీజు భాగాన్ని ప్రభుత్వ పద్దుకు తిరిగి జమచేసి, స్పెషల్ ఫీజు, పరీక్ష ఫీజు, ఇతర ఫీజులను ప్రభుత్వేతర పద్దులో అట్టి పెట్టుకొని వీటి నుండి విద్యార్థులకు సంబంధించి వివిధ ఖర్చులను చేయాలని ప్రభుత్వ ఉత్తర్వులు సూచిస్తున్నాయి. ఆవిధంగా, ప్రభుత్వ కాలేజీల పద్దుల్లో ట్యూషన్ ఫీజు జమ అయిన వెంటనే దానిని చలాన్ ద్వారా ప్రభుత్వ పద్దుకు తిరిగి జమచేయాలి. ***ఐతే, ప్రభుత్వ కాలేజీలు ఈ ఆదేశాలను పాటించక పోవడం వలన ఆ మొత్తాలు ప్రిన్సిపాల్‌ల పద్దులోనే ఉండిపోతున్నాయి.*** ప్రభుత్వ విద్యా సంస్థలకు మొత్తాలను జమచేయడం, ఈ సంస్థలు వాటిని ప్రభుత్వ పద్దుకు తిరిగి జమచేసే ఈ విధానంలో అనవసరంగా ప్రజా నిధులు చిక్కుకుపోతున్నాయి.

ప్రభుత్వం 2008 నుండి 2012 వరకు ప్రభుత్వ విద్యా సంస్థలకు రీయింబర్స్ చేసిన ట్యూషన్ ఫీజు మొత్తం ₹88.30 కోట్లు. ట్యూషన్ ఫీజు, స్పెషల్ ఫీజులను ప్రభుత్వ పద్దుకు జమచేసే అంశంకు సంబంధించి ప్రభుత్వ కాలేజీలకు నిర్దిష్టమైన మార్గదర్శకాలను జారీ చేయమని ఉన్నత విద్యా శాఖను కోరామని ప్రభుత్వ శాఖలు తమ సమాధానంలో పేర్కొన్నాయి.

### *3.4.2.6 స్కాలర్‌షిప్ నిధుల దుర్వినియోగం*

ఏటీఎమ్ సదుపాయంలేని బ్యాంకు ఖాతాలను కలిగిఉన్న విద్యార్థులందరికీ భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్‌బీఐ) వారి ఈజీపే (eZ) కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం 2010 డిసెంబరులో నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అందజేయడం కోసం హైదరాబాదు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారికి ఎస్‌బీఐ మొత్తం 30,059 ఈజీపే/ఏటీఎమ్ కార్డులను జారీ చేసింది (2010-11).

హైదరాబాద్ జిల్లా బీసీ సంక్షేమ అధికారికి చెందిన నాలుగు డివిజన్ల నుండి 2010 నవంబరు - 2011 డిసెంబరు మధ్యకాలంలో 4,156 కార్డులను (వాటిల్లో 2010 నవంబరుకు ముందు జారీ చేసిన ఏటీఎమ్ కార్డులు కూడా ఉన్నాయి) అపహరించారని ఆడిట్ తనిఖీలో వెల్లడైంది. 471 బ్యాంకు ఖాతాలనుండి మొత్తం ₹17.25 లక్షలు (ఈ ఖాతాల్లో జమచేసిన మొత్తం ₹19.12 లక్షల్లో[9] 90 శాతం మేర) మోసపూరితంగా డ్రాచేయడం జరిగింది. నిధుల దుర్వినియోగానికి ఈ కింది కారణాలు దోహదపడ్డాయి :

- బ్యాంకు ఈజీపే/ఏటీఎమ్ కార్డులను, వాటి రహస్య సంకేత పదాలను (పాస్‌వర్డ్) ఒకే కవర్‌లో పంపించడం;
- కార్డులను పంపించకపోవడం, వాటి భద్రతను పట్టించుకోకపోవడం;
- సంబంధిత అధికారి (ఎబీసీడబ్ల్యూఓ) సంఘటనను నివేదించడంలో జాప్యం (సుమారుగా 13 నెలలు), ఆ తర్వాత ఈ కార్డులకు విడుదలచేసిన నిధులను బ్యాంకు అధికారులు స్తంభింపజేసేలా బీసీ సంక్షేమ అధికారి తగిన చర్యలు తీసుకోవడంలో జాప్యం (ఒక నెల).

---

[9] ఏబీసీడబ్ల్యూఓ - చార్మినార్ (90 ఖాతాలు/₹2.91 లక్షలు), ఏబీసీడబ్ల్యూఓ - గోల్కొండ (209 ఖాతాలు/₹8.31 లక్షలు), ఏబీసీడబ్ల్యూఓ - ముషీరాబాద్ (86 ఖాతాలు/₹2.44 లక్షలు), ఏబీసీడబ్ల్యూఓ - సికింద్రాబాద్ (86 ఖాతాలు/₹3.59 లక్షలు)

ఒకే విద్యార్థికి రెండు, మూడు ఈజీపే కార్డులు జారీ కావడం, జారీ అయిన కార్డులకు సంబంధించిన విద్యార్థులు అందుబాటులో లేకపోవడం వలన ఈ కార్డులను అందజేయలేకపోయామని సాంఘిక సంక్షేమ కమీషనర్ తెలిపారు (2012 జూలై). నిధుల దుర్వినియోగ అంశం ప్రస్తుతం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, నేర పరిశోధన శాఖల దర్యాప్తులో ఉందని ప్రభుత్వం పేర్కొంది (2013 ఫిబ్రవరి).

### *3.4.2.7 'రెమిటెన్స్‌ల/చలాన్‌ల రిజిస్టర్'ను నిర్వహించకపోవడం, వచ్చిన మొత్తాలను ట్రెజరీ అంకెలతో రీకన్సిలియేషన్ చేయకపోవడం*

అమలులో ఉన్న ఉత్తర్వుల ప్రకారం, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి చెల్లింపు/సర్దుబాటు చేయని ఎమ్‌టీఎఫ్/ఆర్‌టీఎఫ్ మొత్తాలను విద్యా సంస్థలు పది రోజుల్లోగా ప్రభుత్వ పద్దుకు జమచేసి, సంబంధిత సంక్షేమ శాఖల జిల్లా అధికారులకు చలాన్ కాపీని పంపించాలి. అటువంటి చలాన్‌లన్నింటినీ 'రెమిటెన్సులు/చలాన్‌ల రిజిస్టర్' లో నమోదుచేసి, ట్రెజరీ అంకెలతో ప్రతి నెలా సరిపోల్చి చూడాలి.

***ఐతే, మచ్చుకు తనిఖీ చేసిన వాటిల్లో, ఏ ఒక్క విద్యా సంస్థ/జిల్లా సంక్షేమ అధికారి కూడా ప్రభుత్వ ఉత్తర్వులను పాటించడం లేదు.***

నమూనాకు ఎంపిక చేసుకున్న జిల్లాల్లో రికార్డులను మచ్చుకు చేసిన తనిఖీలో ఆడిట్ ఈ కింది అంశాలను గమనించింది :

- విద్యార్థులకు చెల్లించని ₹2.54 కోట్ల స్కాలర్‌షిప్ మొత్తాలను కాలేజీల ప్రిన్సిపాల్‌లు 2 నుండి 26 నెలల జాప్యంతో తిప్పి పంపారు.
- జిల్లా సంక్షేమ అధికారులు లిఖిత రూపంలోగానీ, ఎలక్ట్రానిక్ రూపంలోగాని కాలేజీల వారీగా ఆయా విద్యా సంస్థల ప్రిన్సిపాల్‌లు తిప్పిపంపిన మొత్తాలకు సంబంధించిన సమాచారాన్ని నిర్వహించని కారణంగా స్కాలర్‌షిప్‌కు సంబంధించి ఆయా సంవత్సరాల్లో వాస్తవంగా జరిగిన ఖర్చు వివరాలను వారు తెలుసుకొనే వీలులేదు.
- ప్రిన్సిపాల్‌లు సమర్పించిన రెమిటెన్సులు/చలాన్‌ల మొత్తాలను జిల్లా సంక్షేమ అధికారులు ట్రెజరీ మొత్తాలతో సరిపోల్చి చూడడం లేదు.

ఈపాస్ వెబ్‌సైట్‌లో రెమిటెన్స్ (చలాన్‌ల) వివరాలను నమోదుచేసే ఏర్పాటుకూడా లేదు.

జేడీలు/డీడీలందరినీ ఈ రిజిస్టర్‌లను నిర్వహించవలసిందిగా, ప్రతి నెలా ట్రెజరీ రీకన్సిలియేషన్ వివరాలను సమర్పించవలసిందిగా ఉత్తర్వులను జారీచేయడం జరిగిందని ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి). ఈపాస్ వెబ్‌సైట్‌లో రెమిటెన్స్ వివరాలను నమోదుచేసే ఏర్పాటు చేస్తామని హామీని కూడా ఇచ్చింది.

### *3.4.2.8 వినియోగ ధృవపత్రాలు*

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, నిధులను అందుకున్న నాటి నుండి 15 రోజుల్లోగా ప్రిన్సిపాల్‌లు వినియోగ ధృవపత్రాలను జిల్లా అధికారులకు సమర్పించాలి. విద్యా సంస్థలు, జిల్లా అధికారులు (సంబంధిత కమీషనరేట్లకు సమర్పించడంలో) ఈ నిబంధనను అనుసరించడం లేదు.

నమూనాకు ఎంపిక చేసిన జిల్లాల్లో, ₹1,606 కోట్ల మొత్తాన్ని విడుదల చేయగా అందుకు ప్రతిగా ₹1,122 కోట్ల[10] మొత్తానికి (70 శాతం) సంబంధించి సంబంధిత అధికారులు అంటే విద్యా సంస్థలు, జిల్లా సంక్షేమ అధికారులు వంటి వారి నుండి వినియోగ ధృవపత్రాలు ఇంకా రావలసిఉంది. వివరాలు ఈ కింద ఇవ్వడమైంది. అంతేకాకుండా, వినియోగ ధృవపత్రాలు వచ్చాయో లేదో తెలుసుకొనేందుకు వీలుగా ఎటువంటి రికార్డును నిర్వహించడం లేదు. ఈపాస్ అప్లికేషన్‌లో కూడా వినియోగ ధృవపత్రాల వివరాలను నమోదు చేసే ఏర్పాటు లేదు.

[10] 2008-09: ₹ 54 కోట్లు; 2009-10: ₹ 154 కోట్లు; 2010-11: ₹ 270 కోట్లు, 2011-12: ₹644 కోట్లు

పట్టిక 3.3

(₹ కోట్లలో)

| శాఖ | విడుదల చేసిన మొత్తం | వచ్చిన వినియోగ ధృవపత్రాలలోని మొత్తం | పెండింగులో ఉన్న వినియోగ ధృవపత్రాలు |
|---|---|---|---|
| బీసీ సంక్షేమం | 948 | 50 | 898 |
| గిరిజన సంక్షేమం | 167 | 11 | 156 |
| మైనారిటీ వర్గాల సంక్షేమం | 491 | 423 | 68 |
| **మొత్తం** | **1606** | **484** | **1122** |

*మూలం : జిల్లా సంక్షేమ అధికారుల రికార్డులు*

అంతేకాకుండా, ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద అత్యుత్తమమైన పాఠశాలల (బీఏఎస్) కు సంబంధించి సాంఘిక సంక్షేమ శాఖ నుండి ₹29.97 కోట్ల మొత్తానికి వినియోగ ధృవపత్రాలు రావలసి ఉంది. ఇంకా ఈ పథకానికి సంబంధించే గిరిజన సంక్షేమ విభాగం వద్ద ₹25.81 కోట్ల మొత్తంలో ₹15.80 కోట్ల మొత్తానికి వినియోగ ధృవపత్రాలు పెండింగులో ఉన్నాయి.

2013-14 సంవత్సరంకు సంబంధించి, కాలేజీలు, విద్యా సంస్థలు వినియోగ ధృవపత్రాలను సమర్పించేందుకు వీలుగా ఈపాస్ లోనే ఏర్పాటును కల్పించడం జరిగిందనీ, అంతకు ముందు సంవత్సరాలకు సంబంధించి ఆయా కాలేజీలు, విద్యా సంస్థల నుండి వినియోగ ధృవపత్రాలను అడగవలసిందిగా సంబంధిత అధికారులకు ఉత్తర్వులనివ్వడమైందనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది (2013 ఫిబ్రవరి).

## 3.5 పథకాల అమలు

### 3.5.1 ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాలు

భారత ప్రభుత్వం ప్రీ-మెట్రిక్యులేషన్ దశలో ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన (ఓబీసీ) విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాన్ని 1998-99 నుండి అమలు చేస్తోంది. ఈ పథకం కింద, వసతి గృహాల్లో (హాస్టల్స్) ఉంటున్న విద్యార్థులకు III నుండి VIII తరగతుల్లోని వారికి నెలకు ₹ 200, IX, X తరగుతుల్లోని వారికి నెలకు ₹ 250 ను సంవత్సరంలో పది నెలలపాటు చెల్లిస్తారు. ఈ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం 'అంగీకరించిన మొత్తం[11]' (కమిటెడ్ లియబిలిటీ) కు మించి అయ్యే ఖర్చులో 50 శాతం భారత ప్రభుత్వం కేంద్ర సాయంగా రాష్ట్రానికి అందజేస్తుంది.

హాస్టల్‌లో లేకుండా చదువుకునే (డేస్కాలర్) ఓబీసీ విద్యార్థులకు కూడా 2009-10 నుండి ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. మార్గదర్శకాల ప్రకారం, తల్లిదండ్రులు అన్ని మార్గాలద్వారా పొందే వార్షిక ఆదాయం ₹44,500 కు మించని, గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే చదువుకుంటున్న విద్యార్థులు - I నుండి V తరగతుల విద్యార్థులు నెలకు ₹25, VI నుండి VIII తరగతుల విద్యార్థులు నెలకు ₹40, IX , X తరగతుల విద్యార్థులు నెలకు ₹50 చొప్పున పొందేందుకు అర్హులు. ఏటా ఒక్కో విద్యార్థికి ₹500 చొప్పున అడ్‌హాక్ గ్రాంటు కూడా ఇవ్వాల్సిఉంటుంది.

[11] 'అంగీకరించిన మొత్తం' అంటే పంచవర్ష ప్రణాళికలోని చివరి సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన మొత్తం ఖర్చు. ఉదాహరణకు 2006-07 లో అంటే, 10వ పంచవర్ష ప్రణాళిక చివరి సంవత్సరంలో కేంద్ర ప్రాయోజిత పథకమైన ఇతర వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం చేసిన మొత్తం ఖర్చు 2011-12 లో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం కింద అంగీకరించిన మొత్తం అవుతుంది

ఈ పథకాన్ని అమలు చేయడం కోసం భారత ప్రభుత్వం 2008-10 మధ్యకాలంలో ₹16.93 కోట్ల మొత్తాన్ని తన వాటాగా విడుదలచేసింది. అందులో 2013 ఫిబ్రవరి నాటికి, ₹4.79 కోట్ల మొత్తాన్ని ఇంకా క్రమబద్ధీకరణ/ఖర్చు చేయాల్సి ఉంది. ఐతే, రాష్ట్ర ప్రభుత్వం ఈ కాలానికి సంబంధించి అంగీకరించిన మొత్తంతోపాటు తన వాటా మొత్తాన్ని ఇంకా కేటాయించలేదు. ఫలితంగా, భారత ప్రభుత్వం 2010-12 లో నిధులను విడుదలచేయలేదు.

### 3.5.2 మెరిట్ అప్‌గ్రేడేషన్ పథకం

IX నుండి XII తరగతులలో చదువుకుంటున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మెరిట్ అప్‌గ్రేడేషన్ పథకం ద్వారా ప్రత్యుపాయ (రెమిడియల్), ప్రత్యేక (స్పెషల్) శిక్షణలను అందించడం కోసం రాష్ట్రానికి 100 శాతం కేంద్ర సాయాన్ని అందించడం జరుగుతుంది. ప్రాథ్యాంశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించడం 'ప్రత్యుపాయ శిక్షణ' లక్ష్యం కాగా, ఇంజినీరింగ్, మెడికల్ వంటి వృత్తి విద్యా కోర్సులలో ప్రవేశం కోసం పోటీ పరీక్షలకు విద్యార్థులను తయారు చేయడం 'ప్రత్యేక శిక్షణ' ఉద్దేశం.

ప్రతి సంవత్సరం, రాష్ట్రం మొత్తంమీద 296 ఎస్సీ విద్యార్థులను (నాలుగు క్లాసుల్లో ప్రతి క్లాసు నుండి 74 మందిని) ఈ పథకం కిందకు తీసుకురావాలి. మునుపటి పరీక్షల్లో అత్యుత్తమంగా రాణించిన వారిని ఈ శిక్షణకు ఎంపిక చేయాలి. శిక్షణకు తగినంత సమయం ఉండేలా, వీరికి ఇతర పిల్లలకు మధ్య అర్థవంతమైన సహచర్యం అలవడేలా చేయడానికై విద్యార్థి IX వ తరగతి స్థాయిలో మొదలయ్యే ఈ శిక్షణ XIIవ తరగతి పూర్తి అయ్యేంత వరకూ నాలుగేళ్లపాటు కొనసాగుతుంది. ఒక విద్యార్థికి సంవత్సరానికి భోజనం, వసతి, పుస్తకాలు, రాత సామగ్రులకుగాను ₹8,000, అధ్యాపకులకు గౌరవ వేతనం, ఇతర అనుబంధ ఖర్చులకు గాను ₹7,000, మొత్తం ₹15,000 లను ప్యాకేజీ గ్రాంటుగా ఇవ్వడం జరుగుతుంది. ఇందుకు సంబంధించి ఆడిట్ పరిశీలనలను ఈ కింది పట్టికలో పేర్కొనడమైంది ః

పట్టిక 3.4

(₹ లక్షల్లో)

| సంవత్సరం | గుర్తించిన లబ్ధిదారుల సంఖ్య | కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు | వీటిలో నుండి రాష్ట్రం విడుదల చేసిన నిధులు | వీటిలో నుండి సాంఘిక సంక్షేమ కమీషనర్ విడుదల చేసిన మొత్తం | ఖర్చు | వ్యాఖ్యలు |
|---|---|---|---|---|---|---|
| **2008-09** | 296 | 44.40 | 44.40 | 44.40 | 44.40 | - |
| **2009-10** | - | - | - | - | - | నిధుల విడుదల జరగని కారణంగా పథకాన్ని అమలు చేయలేదు |
| **2010-11** | 592 | 88.80 | 88.80 | 88.80 | - | విడుదల చేసిన నిధులను ఇతర పథకానికి (బీఏఎస్) మళ్లించారు |
| మొత్తం | **888** | **133.20** | **133.20** | **133.20** | **44.40** | |

*మూలం ః సాంఘిక సంక్షేమ కమీషనరేట్ రికార్డులు*

కేంద్ర సాయంగా పొందిన ₹1.33 కోట్ల గ్రాంట్లకుగాను, రాష్ట్ర ప్రభుత్వం ₹44.40 లక్షలకు సంబంధించి మాత్రమే వినియోగ ధృవపత్రాలను భారత ప్రభుత్వానికి సమర్పించింది. మిగిలిన ₹88.80 లక్షల మొత్తానికి వినియోగ ధృవపత్రాలను 2012 మార్చి నాటికి ఇంకా సమర్పించాల్సి ఉంది.

అవసరమైన నిధులను అందించకపోవడం, కేంద్ర పథకం నిధులను రాష్ట్ర పథకానికి అనధికారికంగా మళ్లించడంకు సమాధానంగా, ఈ పథకాల లక్ష్యాలు ఒకటేనంటూ ప్రభుత్వం సమర్థించుకునే ప్రయత్నం చేసింది. కేంద్ర ప్రభుత్వ నిధులను కేంద్ర పథకాలకు వినియోగించుకునే అధికారాన్ని మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చారు గానీ, రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్ నుండి అమలు చేయాల్సిన రాష్ట్ర పథకాలకు కేంద్ర నిధులను వినియోగించే అధికారం లేదు. కనుక ప్రభుత్వ వాదన అంగీకారయోగ్యం కాదు.

### 3.5.3 అపరిశుభ్ర వృత్తుల్లోని వారి పిల్లలకు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు (సాంఘిక సంక్షేమం)

పారిశుద్ధ్యం, చెత్తను ఊడ్వడం, చర్మం ఒలవడం, తోళ్ళ పరిశ్రమ వంటి సంప్రదాయరీత్యా అపరిశుభ్ర వృత్తుల్లో పనిచేస్తున్న వారి పిల్లలను మెట్రిక్యులేషన్ స్థాయి వరకు విద్యనభ్యసించేలా చేసేందుకు ఆ పిల్లల తల్లిదండ్రులకు ఆర్థిక సాయాన్ని అందించడం ఈ కేంద్ర ప్రాయోజిత పథకం ఉద్దేశం. విద్యార్థులకు ప్రతి నెలా స్కాలర్‌షిప్‌ను, వార్షిక అడ్‌హాక్ గ్రాంటును ఆర్థిక సాయంగా అందిస్తారు. ఈ పథకం కింద స్కాలర్‌షిప్‌ను మంజూరు చేసేందుకు ఆదాయ పరిమితి ఏమీ లేదు. తరగతులు III నుండి X వరకు హాస్టల్స్‌లో ఉండి చదువుకునే విద్యార్థులకు నెలకు ₹700, హాస్టల్స్‌లో లేకుండా చదువుకునే విద్యార్థులకు (డే-స్కాలర్స్) తరగతులు I నుండి X వరకు నెలకు ₹110 స్కాలర్‌షిప్‌గా మంజూరు చేస్తారు. అంతేకాకుండా, అన్ని తరగతులకు సంబంధించి సంవత్సరానికి ఒక విద్యార్థికిగాను డే-స్కాలర్లకు ₹750, హాస్టల్ విద్యార్థులకు ₹1,000 చొప్పున అడ్‌హాక్ గ్రాంటును ఇవ్వడం జరుగుతుంది. స్కాలర్‌షిప్ లను పొందేందుకు అర్హులైన పిల్లల సంఖ్య, ఆదాయ పరిమితులపై నిర్బంధనలను తొలగించి తద్వారా భారత ప్రభుత్వం ఈ పథకాన్ని సరళీకృతం చేసింది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల వివరాలు ఈ కింద ఇవ్వడమైంది.

**పట్టిక 3.5**

**(₹ కోట్లలో)**

| సంవత్సరం | గుర్తించిన లబ్ధిదారుల సంఖ్య | కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం | కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినది | సాంఘిక సంక్షేమ కమీషనర్ వద్ద మిగిలిపోయిన మొత్తం | అయిన ఖర్చు |
|---|---|---|---|---|---|
| **2008-09** | 8000 | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం |
| **2009-10** | 14438 | 21.72 | 11.13 | శూన్యం | 0.71 |
| **2010-11** | 13183 | 8.80 | 10.59 | 7.58 | 0.10 |
| **2011-12** | 16603 | శూన్యం | 8.80 | 0.00 | 1.65 |
| మొత్తం | | **30.52** | **30.52** | **7.58** | **2.46** |

*మూలం : సాంఘిక సంక్షేమ కమీషనరేట్ రికార్డులు*

ఈ పథకం అమలును ఆడిట్ తనిఖీ చేయగా ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

- విడుదల చేసిన ₹22.94 కోట్లలో, కమీషనర్ ఆదేశాల మేరకు ₹9.67 కోట్లను సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనాల అద్దె చెల్లింపులకు, అత్యుత్తమైన పాఠశాలల (బీఏఎస్) పథకానికి మళ్లించారు. ఈ పథకం అమలుపై కేవలం ₹2.46 కోట్లను మాత్రమే వినియోగించారు.

- మిగిలిన ₹10.80 కోట్ల నుండి చేసిన ఖర్చుకు సంబంధించిన వివరాలను జిల్లా అధికారులు ఆడిట్‌కు అందజేయలేదు.

ఆ విధంగా, కేంద్రప్రభుత్వం అందించిన నిధులను విడుదల చేయకపోవడం, పథకం నిధులను హాస్టల్ భవనాల అద్దె చెల్లింపులకు, బీఏఎస్ పథకానికి అనధికారికంగా మళ్లించడం అపరిశుభ్ర వృత్తులలోని వారి పిల్లలకోసం ఉద్దేశించిన ఈ ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం అమలుపై తీవ్ర ప్రభావాన్ని చూపింది.

ప్రతీ సంవత్సరం ఆర్థిక సాయాన్ని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి పంపే ప్రతిపాదనల్లో అద్దె అంశాన్ని చూపుతున్నామని ప్రభుత్వం పేర్కొంది (2013 ఫిబ్రవరి). ఐతే, అటువంటి మళ్లింపుకు కేంద్ర ప్రభుత్వ అనుమతికి సంబంధించి నిర్దిష్ట ఆదేశాలేవీ ఆడిట్‌కు సమర్పించలేదు. పథకంపై అయిన ఖర్చుకు వినియోగ ధృవపత్రాలను జిల్లా అధికారుల నుండి పొందుతున్నామని కూడా తెలియజేయడమైంది. ఇక్కడ గమనించ వలసినది ఏమిటంటే, పారిశుద్ధ్యం, చెత్తనూడ్చేపని, చర్మం ఒలిచే పని, తోళ్ల పరిశ్రమ వంటి సంప్రదాయరీత్యా

అపరిశుభ్రమైన వృత్తుల్లోని వారి పిల్లలను మెట్రిక్యులేషన్ స్థాయి దాకా చదువుకునేలా చేయడానికి ఆ పిల్లల తల్లిదండ్రులకు ఆర్థిక సాయాన్ని అందించడం కోసమే ప్రత్యేకించి ఈ పథకాన్ని ఉద్దేశించారుగాని, సాధారణవర్గ విద్యార్థుల కోసం కాదు. కాబట్టి ప్రభుత్వ వాదన సరికాదు.

### 3.5.4 కేంద్ర ప్రాయోజిత పథకం - ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ నిధుల మళ్లింపు (వెనుకబడిన తరగతుల సంక్షేమం)

ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం కోసం విడుదల చేసే నిధులను మరే ఇతర ప్రయోజనాలకు మళ్లించరాదని కేంద్రప్రభుత్వం జారీ చేసిన ఈ పథకం మార్గదర్శకాలు స్పష్టీకరిస్తున్నాయి. కేంద్ర సాయంగా అందుకునే ఈ నిధులను రాష్ట్ర పథకాలలోని కొరతను తీర్చడం కోసం వినియోగించరాదనీ, ఆమోదించిన ప్రమాణాల మేరకు కేంద్ర ప్రాయోజిత పథకాన్ని ఖచ్చితంగా అమలు చేయాలనీ, రాష్ట్ర పథకాలను విడిగానే కొనసాగించాలని కూడా స్పష్టం చేయడం జరిగింది.

అయితే, ఈ మార్గదర్శకాలకు విరుద్ధంగా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ 2008-09 లో (2008 జూలై, 2009 ఫిబ్రవరి) 18 జిల్లాల వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారులను హాస్టల్ లోని వారికి అలంకరణ సామగ్రి (కాస్మెటిక్) చార్జీల చెల్లింపు నిమిత్తం ఈ పథకం నిధుల నుండి ₹1.69 కోట్ల మొత్తాన్ని వినియోగించు కొనేందుకు అనుమతించింది. ఈ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం తన సాధారణ బడ్జెట్ నుండి భరించాల్సి ఉండగా, పథకం నిధులను ఇందుకోసం మళ్లించడం వలన అర్హులైన విద్యార్థులు ఆ మేరకు స్కాలర్‌షిప్ ప్రయోజనానికి దూరమయ్యారు.

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన ఇతర వెనుకబడిన తరగతుల విద్యార్థుల ప్రయోజనార్థం వినియోగించడం జరిగిందని పేర్కొంటూ ప్రభుత్వం నిధుల మళ్లింపు చర్యను సమర్థించుకోజూసింది. ఐతే, స్కాలర్‌షిప్ కోసం విడుదల చేసే నిధులను మరే ఇతర ప్రయోజనాలకు మళ్లించరాదంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు ఇది విరుద్ధం.

## 3.6 పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు

### 3.6.1 పథకం అమలు జరిగే విధానం

పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్పుల పథకం కింద రెండు రకాల చెల్లింపులను అనుమతిస్తారు. అవి ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ (ఆర్‌టీఎఫ్), నిర్వహణ రుసుం (మెయింటెనెన్స్ ఫీజు - ఎమ్‌టీఎఫ్). ఆర్‌టీఎఫ్ ను కళాశాల/ ప్రిన్సిపాల్ బ్యాంకు ఖాతాలకు నేరుగా చెల్లించడం జరుగుతుంది. ఎమ్‌టీఎఫ్ ను మాత్రం విద్యార్థి ఒకవేళ కళాశాల/శాఖ ఆధీనంలోని వసతి గృహంలో ఉంటున్నట్లైతే ఆయా వార్డెన్ల బ్యాంకు ఖాతాలకు, అలా కాకుండా తాము ఉండేందుకు విడిగా సొంతంగా ఏర్పాటు చేసుకున్నట్లైతే ఆయా విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు చెల్లిస్తారు. ఎమ్‌టీఎఫ్ రేట్లను ప్రామాణీకరించారు. ఆర్‌టీఎఫ్ రేట్లు మాత్రం సంబంధిత కాలేజీ ఫీజులపై ఆధారపడి మారుతూ ఉంటాయి.

సుమారుగా, ప్రతి ఏటా 25 లక్షల విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్ ప్రయోజనాన్ని పొందుతుంటారు. ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం నిర్దేశించిన స్లాబు రేట్ల ప్రకారం లిఖిత రూపంలో (మాన్యువల్‌గా) వాటి మంజూరీ, చెల్లింపులను చేస్తున్నారు. పేరా 3.2.3 లో పేర్కొన్న విధంగా, ఈ ప్రక్రియను ప్రస్తుతం కంప్యూటరీకరిస్తున్నారు. పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను కూడా 2007-08 సంవత్సరం వరకూ 2002 జూలైలో ప్రభుత్వం జారీ చేసిన[12] మార్గదర్శకాలకు అనుగుణంగా లిఖిత రూపంలోనే మంజూరీ, చెల్లింపులు జరిగాయి. స్కాలర్‌షిప్ మొత్తాల

[12] సాంఘిక సంక్షేమ (విద్య 2) శాఖ, జీ.ఓ.ఎమ్ఎస్ నెం.90 తేది 2002 జూలై 30

మంజూరీ, చెల్లింపులలో జరుగుతున్న జాప్యాల దృష్ట్యా, ప్రభుత్వం కంప్యూటరీకరించిన వ్యవస్థద్వారా పథకాన్ని అమలుచేసే ప్రక్రియను 2008 జూలైలో పరిచయం చేసింది. 2008-12 మధ్యకాలంలో లబ్ధిదారుల ఎంపిక, స్కాలర్‌షిప్ చెల్లింపుల విధానంలో 2008-12 మధ్య కాలక్రమంలో చోటుచేసుకున్న మార్పులను ఈ కింద చూపడమైంది:

| విధానం | కాలం | ఆశించిన ప్రయోజనాలు | సమస్యలు |
|---|---|---|---|
| సామాజిక హితార్థ నిర్వహణ వ్యవస్థ (ఎస్‌బీఎమ్ఎస్) (జీ.ఓ.ఎమ్ఎస్ నెం.143 సాంఘిక సంక్షేమ (విద్య 2) శాఖ, తేది 2008 జూలై 15) | 2008-09 | • మంజూరీ ప్రక్రియ సులభతరం చేయడం<br>• ప్రతి నెల ఒకటో తేదీన విద్యార్థులు నగదును డ్రాచేసుకొనేలా మంజూరీ, నిధుల వితరణలు సమయానికి జరిగేలా చూడడం<br>• మంజూరీ, నిధుల వితరణ మొత్తం సమాచారాన్ని పబ్లిక్ డొమైన్‌లో ఉంచి తద్వారా జవాబుదారీతనం, పారదర్శకతలను మెరుగుపరచడం | • చాలీచాలని అంతర్గత నియంత్రణలు<br>• అసంపూర్తిగా ఉన్న సమాచార సేకరణ<br>• నివేదికలను రూపొందించడంలో పరిమితులు<br>• మాస్టర్ టేబుల్ లేకపోవడం<br>• డమ్మీ బ్యాంకు ఖాతాలు జనరేట్ కావడం<br>• అసంబద్ధమైన బడ్జెట్ మొత్తాలు జనరేట్ కావడం |
| ఈపాస్ (ఆన్‌లైన్) (జీ.ఓ.ఎమ్ఎస్ నెం.66 సాంఘిక సంక్షేమ (ఎస్‌డబ్ల్యూ.విద్య 2) శాఖ, తేది 2010 సెప్టెంబరు 8) | 2009-10 నుండి | • ఎస్‌బీఎమ్ఎస్ విధానంలోని సమస్యలను అధిగమించడం | • చాలీచాలని ధృవీకరణ (వేలిడేషన్) నియంత్రణలు<br>• అసంపూర్తిగా ఉన్న సమాచార సేకరణ |

ఎస్‌బీఎమ్ఎస్, ఈపాస్ - ఈ రెండు విధానాల్లోనూ 2008-12 మధ్యకాలంలో లావాదేవీల ప్రక్రియ, విద్యార్థులకు స్కాలర్‌షిప్ మొత్తాల చెల్లింపులకు సంబంధించి ఆడిట్ కనుగొన్న అంశాలను ఈకింద వివరించడమైంది.

### 3.6.2 ఎస్‌బీఎమ్ఎస్ కింద అంగీకారయోగ్యంకాని చెల్లింపులు

పైన పేర్కొన్న వ్యవస్థాగతమైన లోటుపాట్లతో పాటూ, ఎస్‌బీఎమ్ఎస్ లో లావాదేవీలను ఆడిట్ నమూనా తనిఖీ చేయగా ఈ కింద వివరించిన విధంగా అంగీకారయోగ్యంకాని చెల్లింపులు జరిగాయని తేలింది :

- 2007-08 బ్యాచ్ బి.ఎడ్. విద్యార్థులకు (1,484 మందికి) 2008-09 ఫీజు రేట్లను వర్తింపజేసి విద్యార్థికి ₹13,200 చొప్పున రీయింబర్స్‌మెంట్ చేసారు. వాస్తవానికి, 2007-08 రేట్ల ప్రకారం విద్యార్థికి ₹3,675 చొప్పున ఇవ్వాలి. ఫలితంగా, **₹33.49** లక్షల అధిక చెల్లింపు జరిగింది.
- అదేవిధంగా, 2008-09 సంవత్సరంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారులు వివిధ కోర్సులకు సంబంధించి అర్హతకు మించి అధికంగా ఫీజులను విడుదల చేయడం వలన **₹85.51** లక్షల అధిక చెల్లింపు జరిగింది.

అధిక చెల్లింపులను ప్రభుత్వం ధృవీకరిస్తూనే (2013 ఫిబ్రవరి) ఇది ఉద్దేశపూర్వకంగా జరగలేదని పేర్కొంటూ, అధికంగా చెల్లించిన మొత్తాలను రికవరీ చేసేందుకు చర్యలను తీసుకున్నామనీ 2013 ఫిబ్రవరి నాటికి ₹92.38 లక్షలు రికవరీ చేసామని తెలిపింది.

### 3.6.3 ఈపాస్ వ్యవస్థ ఆవిర్భావం

ఈ వ్యవస్థకు సంబంధించి సాధ్యాసాధ్యాల అధ్యయనం, సాంకేతికపరంగా అవసరమయ్యే సిస్టమ్ స్పెసిఫికేషన్లు, వాడకందారుపరంగా అవసరమయ్యే స్పెసిఫికేషన్లు, సేవలనందజేసే వారితో కుదుర్చుకున్న ఒప్పందాలను సాంఘిక సంక్షేమ శాఖ ఆడిట్‌కు అందుబాటులో ఉంచలేదు. అంతేకాక, ఎస్‌బీఎమ్ఎస్ లో ఎదుర్కొన్న కొన్ని ఇబ్బందులను ప్రస్తుత వ్యవస్థ అధిగమించినప్పటికీ, పలు సమస్యాత్మక అంశాలను తరువాతి పేరాలలో చర్చించిన విధంగా ఇంకా పరిష్కరించాల్సి ఉంది.

### *3.6.3.1 ఈపాస్ సమాచార నిర్వహణకు 'సుపరిపాలనా కేంద్రం' వద్ద తగినంతగా సదుపాయాలు లేకపోవడం*

సుపరిపాలనా కేంద్రాన్ని పరిశోధన కోసం, వృత్తిపరమైన సలహాలనందించేందుకు, నిర్వహణ మార్పులకు సంబంధించి కార్యక్రమాలను నిర్వహించేందుకుగాను ఏర్పాటు చేసారు. ఈ కేంద్రాన్ని స్థాపించే క్రమంలో దానికి కల్పించిన మౌలిక సదుపాయాలపరంగా ప్రభుత్వ శాఖలు/సంస్థలకు సమాచార కేంద్ర సేవలు (డేటా సెంటర్ సర్వీసెస్) ను ఈ కేంద్రం అందించలేదు. ఈ సేవల కింద కేంద్రీకృత మౌలిక సదుపాయాల అభివృద్ధి, భౌతికపరమైన భద్రత/రక్షణ వ్యవస్థలు, పరిసరాల నియంత్రణ, భారీ స్థాయిలో సమాచారాన్ని భద్రపరచడం, పంపిణీకి ఉపయుక్తమైన సమాచారాన్ని ఉత్పాదించడం, అవసరమైన సమాచారాన్ని శోధించి పొందడం, సమాచార నిర్వహణ, దాన్ని కోల్పోకుండా బేక్ అప్ తీసుకోవడం మొదలైన అంశాలను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ కేంద్రం వద్ద చాలినంత మౌలిక సదుపాయాలు లేకపోయినప్పటికీ, ఈపాస్ వ్యవస్థలోని సమాచార భద్రత, అవసరమైన సమాచార శోధన, బేక్ అప్, నిర్వహణ బాధ్యతలను సుపరిపాలన కేంద్రానికి సాంఘిక సంక్షేమ శాఖ అప్పగించింది (2009 నవంబరు). ఐతే, ఈ కేంద్రం ఈపాస్ అప్లికేషన్‌లో పెరుగుతున్న సమాచార భారాన్ని నిర్వహించడంలో తన అశక్తతను వ్యక్తం చేసింది (2011 మార్చి).

సుపరిపాలనా కేంద్రం అన్ని సదుపాయాలను కలిగిఉన్న పూర్తి స్థాయి సమాచార కేంద్రం అని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఈపాస్ అప్లికేషన్‌లో పెరుగుతున్న సమాచార భారాన్ని నిర్వహించడానికి సుపరిపాలనా కేంద్రమే స్వయంగా అశక్తతను వ్యక్తం చేయడం గమనార్హం.

### *3.6.3.2 ఈపాస్ లో చాలీచాలని అప్లికేషన్ నియంత్రణలు*

విద్యార్థుల/కాలేజీల దరఖాస్తుల పరిశీలన, స్కాలర్‌షిప్ మంజూరీ, చెల్లింపులకు సంబంధించి ఈపాస్ వ్యవస్థలోని సమాచారాన్ని ఆడిట్ విశ్లేషించగా ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

*మాన్యత లేని/నకిలీ నమోదులు*

- 2010-11, 2011-12 సంవత్సరాల్లో, వరుసగా 24.46 లక్షల విద్యార్థుల్లో 56,582 మంది, అలాగే 24.89 లక్షల విద్యార్థుల్లో 53,818 మంది ఒకే ఈ-మెయిల్ చిరునామాను ఉపయోగించారు.
- వేరువేరు 25 సంస్థలకు చెందిన 1,961 విద్యార్థులకు ఒకే చరవాణి (మొబైల్) సంఖ్య నమోదయింది.

2011-12 సంవత్సరం ద్వితీయార్థం నుండి ఒకే ఈమెయిల్/మొబైల్ సంఖ్యలను పలుమార్లు నమోదు చేయడాన్ని ఈపాస్ వ్యవస్థ అనుమతించదని ప్రభుత్వం తెలిపింది. ఐతే, 2011-12 సంవత్సరంలోని సమాచార విశ్లేషణలో కూడా మాన్యత లేని/నకిలీ నమోదులు వెలుగు చూడడంవలన ప్రభుత్వం ఇచ్చిన సమాధానం సరైనదికాదు.

*అడ్మిషన్ క్యాటగిరీ నమోదు చేయకపోవడం (కన్వీనర్/ మేనేజ్‌మెంట్/స్పాట్ అడ్మిషన్ కోటా)*

ఉమ్మడి ప్రవేశ పరీక్షకు (సెట్) సంబంధించి 2009-10 సంవత్సరంలోని అన్ని కేసుల్లోనూ (4.70 లక్షల విద్యార్థులు), 2010-11 సంవత్సరంలో 5.04 లక్షల విద్యార్థుల్లో 5,570 మంది, 2011-12 సంవత్సరంలో 4.09 లక్షల విద్యార్థుల్లో 365 మంది విషయంలో అడ్మిషన్ క్యాటగిరీని నమోదు చేయలేదు.

ఆడిట్ పరిశీలనను ప్రభుత్వం అంగీకరిస్తూనే, మాన్యతా నియంత్రణ లేకపోవడానికి సాంకేతికపరమైన తప్పిదం కారణమని తెలిపింది.

### అర్హమైన పరిమితికి మించి కుటుంబ ఆదాయం ఉన్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను మంజూరు చేయడం

ఈపాస్ అప్లికేషన్‌లో కుటుంబ ఆదాయం లక్ష రూపాయలకు మించి ఉన్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను తిరస్కరించవలసిన వ్యవస్థ విఫలమైన ఫలితంగా 2008-11 మధ్యకాలంలో 576 అనర్హులైన విద్యార్థులకు **₹90** లక్షల మేర స్కాలర్‌షిప్‌ను చెల్లించడం జరిగింది.

ఆదాయ వివరాలను సరిచేసేందుకు సంబంధించి ఆప్షన్లను మార్చే బాధ్యతను జిల్లా అధికారులకు అప్పగించినా ఆ బాధ్యతను నిర్వర్తించడంలో వారి వైఫల్యమే ఈ పొరపాటుకు కారణమని ప్రభుత్వం తెలిపింది.

### కోర్సు కాలావధికి మించి స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయడం

స్కాలర్‌షిప్‌లను మంజూరు చేసేప్పుడు పరిగణించాల్సిన ముఖ్యమైన అంశాల్లో కోర్సు కాలావధి ఒకటి. ఐతే, కోర్సు కాలావధులను పరిగణించకుండానే స్కాలర్‌షిప్ చెల్లింపులకు మంజూరీనిచ్చారు. ఫలితంగా, నమూనాకు ఎంపిక చేసిన జిల్లాల్లో 73 మంది ఎమ్‌బీబీఎస్/బీడీఎస్ విద్యార్థులకు కోర్సు కాలావధికి మించి (4 1/2 ఏళ్లకు గాను 5 ఏళ్లదాకా) చెల్లింపులు చేసిన కారణంగా **₹11.98** లక్షల మేర అధిక చెల్లింపు జరిగింది.

ఎన్‌టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వారు తెలియజేసిన విధంగా వైద్య సహాయకులుగా పనిచేసే కాలానికి సంబంధించిన ఫీజును కూడా ఈపాస్ వ్యవస్థలో తీసుకోవడం జరిగిందని ప్రభుత్వం తెలిపింది. ఐతే, కోర్సు కాలావధికి మాత్రమే ఫీజును వసూలు చేయాలని స్పష్టంగా నిర్దేశిస్తున్న ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులకు[13] ఇది విరుద్ధం.

### ఈపాస్ అప్లికేషన్ పట్టికలో విద్యార్థుల వివరాలు లభ్యం కానప్పటికీ వారికి పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను మంజూరు చేయడం

అప్లికేషన్ పట్టికలో విద్యార్థుల దరఖాస్తు గుర్తింపు సంఖ్య (ఐడీ)తో పాటు వారి పూర్తి వివరాలుంటాయి. ఈ పట్టికలో విద్యార్థులకు సంబంధించి ఏమైనా కొన్ని వివరాలు లేనట్లైతే వారి వివరాలను పరిశీలించటం కుదరదు. ఐతే, 2008-12 మధ్యకాలంలో 649 మంది విద్యార్థులకు వారి సమాచారం, దరఖాస్తు ఐడీ లభ్యం కాకపోయినప్పటికీ పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను మంజూరు చేసారని గమనించడమైంది.

ఈ దరఖాస్తులు ఇతర రాష్ట్రాల్లో చదువుకుంటున్న ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు, అత్యుత్తమ పాఠశాలల (బీఏఎస్) విద్యార్థులకు సంబంధించినవి కావడం వలన ఇది సాంకేతికపరంగా వీలుకాదని ప్రభుత్వం పేర్కొంది. స్కాలర్‌షిప్‌కు అర్హులైన విద్యార్థులందరి వివరాలు అప్లికేషన్ సమాచారంలో లభ్యంకావాలి కనుక ప్రభుత్వం సమాధానం ఆమోదయోగ్యం కాదు.

### కాలేజి బ్యాంకు ఖాతాలకు ఎమ్‌టీఎఫ్‌ను జమచేయడం

కాలేజీ లకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెల్లింపులకు సంబంధించిన మార్గనిర్దేశకాల ప్రకారం, కాలేజీలకు ఆర్‌టీఎఫ్, విద్యార్థులకు నిర్వహణ చార్జీల (ఎమ్‌టీఎఫ్) చెల్లింపులు ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారానే చేయాలి. అన్ని కాలేజీలు, లబ్ధిని పొందగోరే విద్యార్థులు తప్పనిసరిగా బ్యాంకు ఖాతాలను కలిగిఉండి, దాని వివరాలను బ్యాంకు ఖాతా పుస్తకం మొదటి పేజీ నకలుతో పాటుగా రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించాలి. సంబంధిత కాలేజీ లకు ఆర్‌టీఎఫ్‌ను రెండు వాయిదాలలోనూ, విద్యార్థులకు/వార్డెన్ల బ్యాంకు ఖాతాలకు ఎమ్‌టీఎఫ్ ను నాలుగు వాయిదాలలోనూ చెల్లిస్తారు. బ్యాంకు ఖాతా సంఖ్యలలో ఎలాంటి మార్పుని చేయాలన్నా ఇందుకు అధికారాన్ని కలిగిఉన్న కాలేజీ ప్రతినిధి లేదా విద్యార్థి మాత్రమే, సందర్భానుసారం, చేయాల్సి ఉంటుంది.

[13] మెమో నెం.14528/ఈ1/2002-2, తేదీ 2002 అక్టోబరు 3

ఈ మార్గ నిర్దేశాలకు విరుద్ధంగా, 2009-12 మధ్యకాలంలో 1,21,806 సందర్భాల్లో విద్యార్థుల బ్యాంకు ఖాతా వివరాల స్థానంలో విద్యా సంస్థల బ్యాంకు ఖాతా వివరాలతో నింపేసినట్టు గమనించడం జరిగింది.

అంతేకాకుండా, కాలేజి అనుబంధ హాస్టల్, ఆయా శాఖల అనుబంధ హాస్టల్‌లలో ఉండని విద్యార్థులకు మంజూరు చేసిన ₹4.30 కోట్ల మేర ఎమ్‌టీఎఫ్ మొత్తాన్ని కాలేజి బ్యాంకు ఖాతాలకు జమచేసారని కూడా గమనించడమైంది.

ఈ సమాచారాన్ని ఈపాస్ సమాచారంతో పరిశీలించామనీ, ఎస్ఎమ్‌హెచ్/డేస్కాలర్ విద్యార్థులెవరికీ సీఏహెచ్/డీఏహెచ్ కింద ఎమ్‌టీఎఫ్‌ను మంజూరు చేయలేదని ఆ పరిశీలనలో వెల్లడైందని ప్రభుత్వం తెలిపింది. ఐతే, తొమ్మిది కేసుల్లో ఎమ్‌టీఎఫ్‌ను కాలేజీ/హాస్టల్ ఖాతాలకు మంజూరు చేసారనీ, రెండు సందర్భాలలో మొత్తాలను కాలేజీ /హాస్టల్ ఖాతాలకు విడుదల చేసారని కూడా ఆడిట్ గమనించింది.

### *3.6.3.3 పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను నియమ విరుద్ధంగా రీయింబర్స్‌మెంట్ చేయడం*

నమూనాకు ఎంపిక చేసిన జిల్లాల ఆడిట్ తనిఖీలో స్కాలర్‌షిప్‌లను ఈ కింద వివరించిన విధంగా నియమ విరుద్ధంగా రీయింబర్స్‌మెంట్ చేసిన అనేక సందర్భాలు వెల్లడయ్యాయి :

*అర్హతలేని గేట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ మంజూరీ*

గేట్[14] లో ర్యాంకును పొందిన విద్యార్థులు, సాయాన్ని ఒకే రూపంలో పొందేందుకు మాత్రమే అర్హులనీ, ఇతర సాయంతో దీన్ని కలపరాదనీ ప్రభుత్వ ఉత్తర్వులు[15] నిర్దేశిస్తున్నాయి. ఇందుకు విరుద్ధంగా, 2010-11 లో పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను 137 గేట్ విద్యార్థులకు చెల్లించ డం వలన **₹76.82 లక్షల**[16] మేర సరికాని చెల్లింపులు జరిగాయి.

అనర్హులైన విద్యార్థుల నుండి ఈ మొత్తాలను రికవరీ చేయడానికి ఉత్తర్వులు జారీ చేసామని, ఆ ప్రక్రియ పురోగతిలో ఉందని ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి).

*అర్హతలేని స్పాట్ అడ్మిషన్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు*

ప్రభుత్వ ఉత్తర్వుల[17] (2011 ఫిబ్రవరి) ప్రకారం,కౌన్సిలింగ్ ప్రక్రియ పూర్తయిన తరవాత కన్వీనర్ కోటాకింద భర్తీకాని సీట్లను స్పాట్ అడ్మిషన్లుగా పరిగణించాలి; వీటికి ఆర్‌టీఎఫ్/ఎమ్‌టీఎఫ్ చెల్లించడం జరగదు. ఐతే, ఈ నిబంధనలకు విరుద్ధంగా, 2010-11 మధ్యకాలంలో 152 విద్యార్థులకు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌గా **₹56.49** లక్షలను[18] చెల్లించారు.

తమ ఉత్తర్వులకు విరుద్ధంగా మంజూరీలు జరగలేదని ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి). ఐతే, ఆడిట్ కనుగొన్న కేసులు 2010-11 లోని సరికొత్త కేసులే తప్ప ఆ సంవత్సరంలో రెన్యూవల్‌కు సంబంధించినవి కావు. అంతేకాక, ఉన్నత విద్య ఏపీ రాష్ట్ర కౌన్సిల్ నుండి పొందిన సమాచారాన్ని ఈపాస్‌లోని మంజూరీలతో విశ్లేషించి కనుగొన్నవి కనుక ప్రభుత్వ సమాధానం అంగీకారయోగ్యం కాదు.

---

14 గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్

15 సాంఘిక సంక్షేమ (విద్య-2) శాఖ 2011 ఆగస్టు 16 తేదీన జారీ చేసిన మెమో నెం.1611 /ఎడబ్ల్యూ.విద్య2/2011-7

16 చిత్తూరు - ₹3.11 లక్షలు; హైదరాబాద్ - ₹5.57 లక్షలు; ఖమ్మం - ₹3.99 లక్షలు; రంగారెడ్డి - ₹39.53 లక్షలు; శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు - ₹1.30 లక్షలు, విశాఖపట్నం - ₹23.32 లక్షలు

17 సాంఘిక సంక్షేమం (విద్య 2) శాఖ 2011 ఫిబ్రవరి 3 తేదీ నాటి మెమో నెం.1611/ఎస్‌డబ్ల్యూ.విద్య2/2011-2

18 చిత్తూరు: ₹10.97 లక్షలు (30); ఖమ్మం: ₹3.86 లక్షలు (10); రంగారెడ్డి : ₹16.10 లక్షలు (43); శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు: ₹1.45 లక్షలు (4), విశాఖపట్నం: ₹24.11 లక్షలు (65)

*సవరించిన ఫీజు విధానాన్ని అప్‌డేట్ చేయకపోవడం*

ఈపాస్ డేటాబేస్‌లో 1,806 విద్యార్థులకు సంబంధించి సవరించిన ఫీజు వివరాలను అప్‌డేట్ చేయకపోవడంవలన ఆర్‌టీఎఫ్ ను అర్హతకు మించి **₹82.82 లక్షలను**[19] అధికంగా చెల్లించారు (2009-11).

ఈ కేసులను పరిశీలించి దిద్దుబాటు చర్యలను తీసుకుంటామని ప్రభుత్వం హామీనిచ్చింది.

*నియమ విరుద్ధంగా స్పెషల్ ఫీ మంజూరీ*

ఏపీ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ లో ఆర్ట్స్ కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులకు, వారు స్పెషల్ ఫీ కి అర్హులుకానప్పటికీ, నియమ విరుద్ధంగా **₹43.95 లక్షల** మేర స్పెషల్ ఫీ ని మంజూరు చేసారు.

ఇందుకు సంబంధించి గిరిజన సంక్షేమ శాఖ నిర్దిష్టమైన సమాధానాన్ని ఇవ్వలేదు.

2009-10 సంవత్సరంకు సంబంధించి ఎమ్.ఫార్మసీ కోర్సుకు ఎలాంటి స్పెషల్ ఫీని ప్రభుత్వం ప్రకటించలేదు. ఐతే, ఆ సంవత్సరంలో 541 మంది ఎమ్.పార్మసీ విద్యార్థులకు స్పెషల్ ఫీ రూపంలో **₹15.57 లక్షలను** మంజూరు చేసారు.

సంబంధిత కాలేజీల నుండి ఆయా మొత్తాలను రికవరీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి).

*వర్గీకరణ దోషాల వలన అధిక రేట్లతో ఎమ్‌టీఎఫ్ మంజూరీ*

మహిళా కళాశాల (ఉస్మానియా విశ్వవిద్యాలయం) కు చెందిన డేస్కాలర్లకు, వారికి వర్తించే స్కాలర్‌షిప్ రేట్లకు బదులు విద్యార్థులు నిర్వహించే హాస్టల్స్ (ఎస్ఎమ్‌హెచ్) లో ఉండేవారికి ఇచ్చే రేట్లను వర్తింపజేయడం వలన 2008-11 మధ్యకాలంలో 2,946 విద్యార్థుల విషయంలో **₹27.15 లక్షల** మేర అధికంగా స్కాలర్‌షిప్ చెల్లింపుకు దారితీసింది.

2011-12 సంవత్సరం నుండి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సంబంధించి ఎస్ఎమ్‌హెచ్ క్యాటగిరీని ఆపేసామనీ, ఆ విద్యార్థులకు రెండు రకాలైన అంటే కాలేజి అనుబంధ హాస్టల్, డేస్కాలర్ క్యాటగిరీలు మాత్రమే వర్తిస్తాయని ప్రభుత్వం పేర్కొంది (2013 ఫిబ్రవరి). ఐతే, 2011-12 సంవత్సరంలో కూడా ఎస్ఎమ్‌హెచ్ లకు స్కాలర్‌షిప్‌లను మంజూరు చేసినట్లు ఆడిట్ కనుగొంది కాబట్టి ప్రభుత్వ వాదన ఆమోదయోగ్యం కాదు.

ఆమోదించిన క్లెయిమ్‌లన్నింటినీ పరిశీలించి, అధిక మొత్తాలకు మంజూరీలను ఇచ్చిన చోట్ల వాటిని రికవరీ చేయాలనీ, సరైన క్లెయిమ్‌ల విషయంలో వాటిలోని ఇబ్బందులను తగురీతిన తొలగించి క్లెయిమ్‌లను పరిష్కరించాలనీ కమీషనర్లు/జిల్లా కలెక్టర్లు/సంక్షేమ అధికారులందరికీ ప్రభుత్వం ఆదేశాలను జారీచేసింది (2010 ఆగస్టు). ఐతే, రికవరీలు చేయడం కోసం ఈపాస్ సమాచారాన్ని విశ్లేషించే దిశగా సంబంధిత శాఖలు ఎలాంటి చర్యలను ఆరంభించక పోవడం వలన 2012 మార్చి నాటికి ఏవిధమైన రికవరీలు జరగలేదు.

### 3.6.3.4 బూటకపు క్లెయిమ్‌లు

ఈపాస్ వ్యవస్థలోని దరఖాస్తు ఫారంలో కొన్ని ఫీల్డ్‌లకు (పాస్ రకం/స్టేట్/బోర్డు) అభ్యర్థులు వేరువేరు ఆప్షన్లను ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉన్న కారణంగా ఒకే అభ్యర్థి దాఖలు చేసిన పలు దరఖాస్తులను ఈపాస్ అనుమతిస్తోంది. ఫలితంగా అదే అభ్యర్థికి పలుమార్లు మంజూరీలు/స్కాలర్‌షిప్ విడుదలలు జరిగాయి. అలాంటి డూప్లికేట్ దరఖాస్తుల సంఖ్య (ఎస్ఎస్‌సీ గుర్తింపు సంఖ్య, ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత సంవత్సరం, జనన తేదీలతో

[19] చిత్తూరు - ₹22.27 లక్షలు; హైదరాబాద్ - ₹22.88 లక్షలు; ఖమ్మం - ₹2.95 లక్షలు; రంగారెడ్డి - ₹28.22 లక్షలు; శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు - ₹0.17 లక్ష; విశాఖపట్నం - ₹6.33 లక్షలు

సరిపోలిన దరఖాస్తులు) ఒక్కో కాలేజీలో 2 నుండి 66 దాకా ఉన్నాయి. ఈ విధమైన వెసులుబాటు ఫలితంగా 2008-12 నాలుగేళ్ల కాలంలో మొత్తం 19,375 బూటకపు స్కాలర్‌షిప్ క్లెయిమ్‌లకు సంబంధించి **₹20.60 కోట్ల** చెల్లింపులు జరిగాయి. దరఖాస్తులోని లొసుగే ఈ లోపానికి కారణం. ఇది ప్రిన్సిపాల్, పరిశీలనాధికారి, జిల్లా సంక్షేమ అధికారుల వైఫల్యాన్ని ప్రతిబింబిస్తోంది.

ఆడిట్ పరిశీలనలను అంగీకరిస్తూ (2013 ఫిబ్రవరి), సంబంధిత విద్యార్థులు, కాలేజీల నుండి మొత్తాలను రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం తెలిపింది.

### *3.6.3.5 పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ మంజూరీలలో జాప్యం*

ప్రభుత్వ విధానం ప్రకారం, స్కాలర్‌షిప్‌లను 'సంతృప్తత ప్రాతిపదికన' (సాట్యురేషన్ బేసిస్) మంజూరు చేయాలి. ఐతే, 2009-11 మధ్యకాలంలో 3 నుండి 19 శాతం విద్యార్థులకు అదే విద్యా సంవత్సరంలో ఎమ్‌టీఎఫ్, ఆర్‌టీఎఫ్ లను మంజూరు చేయలేదు. 2008-09 సంవత్సరంలో ఇందుకు సంబంధించిన వివరాలు ఈపాస్ వ్యవస్థలో లభ్యం కాలేదు. అంతేకాకుండా, 2011-12 లో వచ్చిన దరఖాస్తుల సంఖ్య, స్కాలర్‌షిప్‌ను పొందిన విద్యార్థుల సంఖ్య వివరాలు కూడా ఈపాస్‌లో లభ్యంకాలేదు.

**పట్టిక 3.6**

| సంవత్సరం | విద్యార్థుల సంఖ్య | | | మంజూరు చేసిన మొత్తం (₹ కోట్లలో) | చెల్లించాల్సి ఉన్న మొత్తం (₹ కోట్లలో) | అదే సంవత్సరంలో ఎమ్‌టీఎఫ్/ఆర్‌టీఎఫ్ మంజూరుకాని విద్యార్థుల శాతం |
|---|---|---|---|---|---|---|
| | ఎమ్‌టీఎఫ్, ఆర్‌టీఎఫ్ కోసం దరఖాస్తు చేసినవారు | ఎమ్‌టీఎఫ్, ఆర్‌టీఎఫ్‌లకు మంజూరీ పొందినవారు | మంజూరీ పొందాల్సిన వారు | | | |
| **2009-10** | 2267874 | 1626569 | 641305 | 2839.93 | 88.01 | 3% |
| **2010-11** | 2204616 | 764978 | 1439638 | 2905.98 | 542.09 | 19% |

*మూలం : ఈపాస్ సమాచారం*

ప్రభుత్వం ఆర్‌టీఎఫ్ ను విడుదల చేయకపోవడంతో, కాలేజీ యాజమాన్యం విద్యార్థుల నుండి బలవంతంగా ఫీజులను వసూలు చేస్తున్నాయి. ఈ విషయం కాలేజీ ల ప్రత్యక్ష తనిఖీలోనూ, లబ్ధిదారుల సర్వేలోనూ నిర్ధారితమయింది. సుమారు 9 శాతం విద్యార్థులను సర్వే చేయగా, కాలేజీ/సంస్థలకు ముందస్తుగా చెల్లించిన ట్యూషన్ ఫీజులు వారు ఇంకా పొందాల్సి ఉందని తెలిపారు.

కొన్ని కాలేజీ లు విద్యార్థుల నుండి బలవంతంగా ఫీజులను వసూలు చేస్తున్నాయన్న దానితో ప్రభుత్వం ఏకీభవిస్తూనే, స్కాలర్‌షిప్‌కు డిమాండ్ అసాధారణ రీతిలో పెరిగిపోవడం వలన వాటి మంజూరులో జాప్యం జరిగిందనీ, ఫలితంగా అదే సంవత్సరంలో అవసరాలను తీర్చలేకపోయామనీ, దానివల్ల బకాయిలను తరువాతి ఆర్థిక సంవత్సరంలో తీర్చాల్సి వచ్చిందని పేర్కొంది.

### *3.6.3.6 ఈపాస్ వ్యవస్థలో ఫీజు విధానాన్ని సరిగా ప్రోగ్రామ్ చేయకపోవడం*

ప్రభుత్వ ఉత్తర్వుల (2010 సెప్టెంబరు) ప్రకారం, పథకాన్ని పర్యవేక్షించే విభాగం (పీఎమ్‌యూ) ఫీజు, కోర్సుల వివరాలను అప్‌డేట్ చేయడం, ఫీజు విధానాన్ని పర్యవేక్షించడం, ఈపాస్ వ్యవస్థలో అన్ని సంక్షేమ శాఖలకు సంబంధించిన సాంకేతికపరమైన ఇబ్బందులను పరిష్కరించడం విధిగా చేయాలి.

ఐతే, పలుకేసుల్లో ఈపాస్‌లో ప్రోగ్రామ్ చేసిన దానికి, ఆమోదించిన ఫీజు విధానానికి మధ్య వ్యత్యాసాలుండడంతో పీఎమ్‌యూ తన విధులను నిర్వర్తించడం లేదని స్పష్టమౌతోంది. మూడు విశ్వవిద్యాలయాల అధికారిక ఫీజు వివరాలను ఈపాస్ అప్లికేషన్‌లోని ఫీజు వివరాలతోనూ, వాస్తవంగా జమ చేసిన స్కాలర్‌షిప్ రేట్లతోనూ ఆడిట్ మచ్చుకు తనిఖీ చేసింది. ఇలా సరిపోల్చినపుడు, 624 కుగాను 107 కోర్సుల్లో వ్యత్యాసాలున్నట్లు వెల్లడైంది. ఫలితంగా ఈకింద వివరించినట్లుగా **₹67 లక్షల** అధిక చెల్లింపు జరిగింది.

పట్టిక 3.7

(₹ లక్షల్లో)

| విశ్వవిద్యాలయం పేరు | సంవత్సరం | ట్యూషన్ ఫీజు (విద్యార్థుల సంఖ్య) | స్పెషల్ ఫీజు (విద్యార్థుల సంఖ్య) | మొత్తం |
|---|---|---|---|---|
| శ్రీ వేంకటేశ్వర | 2009-10 | 1.40 (185) | 0.79 (93) | 2.19 |
| కాకతీయ | 2010-11 | 0.84 (64) | 0.18 (50) | 1.02 |
| ఉస్మానియా | 2011-12 | 45.58 (3408) | 18.40 (920) | 63.98 |
| మొత్తం | | **47.82 (3657)** | **19.37 (1063)** | **67.19** |

*మూలం : విశ్వవిద్యాలయాలు, ఈపాస్‌ల నుండి సేకరించిన సమాచారం*

ఫీజు విధానాన్ని పీఎమ్‌యూ సరిగా పర్యవేక్షించక పోవడం వల్లనే ట్యూషన్, స్పెషల్ ఫీజుల అధిక చెల్లింపు జరిగిందనీ, ఆమేరకు విద్యా సంస్థలు ఆయాచితంగా లాభపడ్డాయనీ స్పష్టమౌతోంది. ఇతర విశ్వవిద్యాలయాల విషయంలో కూడా ఈవిధంగా ట్యూషన్, స్పెషల్ ఫీజుల అధిక చెల్లింపులు జరిగాయన్న అంశాన్ని తోసిపుచ్చలేము.

ఇందుకు సంబంధించి ప్రభుత్వం నిర్దిష్టమైన సమాధానివ్వలేదు.

### *3.6.3.7 అర్హతలేని వయసువారికి స్కాలర్‌షిప్‌ల మంజూరీ*

సాంఘిక సంక్షేమ శాఖ ఆదేశాల (2011 నవంబరు) ప్రకారం, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పొందడానికి నిర్ణయించిన గరిష్ఠ వయోపరిమితి వివరాలు ఇలా ఉన్నాయి :

పట్టిక 3.8

| విద్యా స్థాయి | ఈబీసీ/మైనారిటీలు/వికలాంగులు | ఎస్సీ/ఎస్టీ, బీసీ |
|---|---|---|
| ఇంటర్మీడియేట్ | 20 సంవత్సరాలు | 24 సంవత్సరాలు |
| గ్రాడ్యుయేట్ | 25 సంవత్సరాలు | 29 సంవత్సరాలు |
| పోస్ట్-గ్రాడ్యుయేట్, ఆపైన | 30 సంవత్సరాలు | 34 సంవత్సరాలు |

*మూలం : ఈపాస్ సమాచారం*

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం '0' నుండి 14 సంవత్సరాల వయసు వారికీ, 34 సంవత్సరాలు దాటిన వారికీ స్కాలర్‌షిప్ నిరాకరించాలి. ఐతే, ఈపాస్ సమాచార విశ్లేషణలో, ఈకింద వివరించిన విధంగా వయో పరిమితి కంటే తక్కువ వయసున్నవారికీ, పరిమితి దాటినవారికీ 2011-12 లో ₹1.44 కోట్ల మేర స్కాలర్‌షిప్‌లను మంజూరుచేసి, విడుదల చేసారని వెల్లడైంది.

పట్టిక 3.9

(₹ లక్షల్లో)

| వయస్సు (సంవత్సరాల్లో) | విద్యార్థుల సంఖ్య | ఆర్‌టీఎఫ్ | | ఎమ్‌టీఎఫ్ | | మొత్తం | |
|---|---|---|---|---|---|---|---|
| | | మంజూరైనవి | విడుదల చేసినవి | మంజూరైనవి | విడుదల చేసినవి | మంజూరైనవి | విడుదల చేసినవి |
| **0 to 14** | 1165 | 62.01 | 27.34 | 18.58 | 12.52 | 80.59 | 39.86 |
| **35 to 112** | 1458 | 173.83 | 72.59 | 42.38 | 31.93 | 216.21 | 104.52 |
| మొత్తం | **2623** | **235.84** | **99.93** | **60.96** | **44.45** | **296.80** | **144.38** |

*మూలం : ఈపాస్ సమాచారం*

స్కాలర్‌షిప్‌లకు వయో పరిమితిని 2011-12 సంవత్సరం నుండి కొత్త విద్యార్థులకు మాత్రమే వర్తింపజేస్తున్నామనీ, ఈ పథకంలో ముందునుంచే నమోదు అయిఉండి, స్కాలర్‌షిప్ కోసం రెన్యూవల్ చేయించుకోదలిచే విద్యార్థులకు ఈ పరిమితి వర్తించదనీ ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి). అలా రెన్యూవల్ చేయించుకున్న వయో పరిమితి దాటిన విద్యార్థులకు మాత్రమే 2011-12 లో స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయడం జరిగిందని తెలిపింది. ఐతే, పైన చెప్పిన ప్రభుత్వ మెమొరాండంలో కొత్త, రెన్యూవల్ కేసుల మధ్య తారతమ్యాన్ని చూపకుండా, 2011 జూలై 01 నాటికి అర్హతను పొందేందుకు ఉండాల్సిన గరిష్ఠ వయసును మాత్రమే అందులో నిర్దేశించడం జరిగింది, కాబట్టి ప్రభుత్వ వాదన సరికాదు. అంతేకాకుండా, ఈపాస్ సమాచార విశ్లేషణలో కొత్త విద్యార్థుల విషయంలో కూడా వయో పరిమితిని వర్తింప చేయలేదని వెల్లడైంది.

### *3.6.3.8 ఫీజును అధికంగా జమ చేయడం*

ఈపాస్ వ్యవస్థ, ప్రతి విద్యార్థి ఆర్‌టీఎఫ్‌ను సంబంధిత కోర్సు/కాలేజీ లకు సంబంధించిన ఆయా విశ్వ విద్యాలయాలు నిర్దేశించిన ఫీజు విధానం ఆధారంగా లెక్కిస్తుంది. ఐతే, 2008-12 మధ్యకాలంలో మంజూరైన ఆర్‌టీఎఫ్ ఫీజు వివరాల విశ్లేషణలో, ఈపాస్ అప్లికేషన్ ఫీజును సరిగా లెక్కించక పోవడంతో ప్రభుత్వం కాలేజీలకు ₹33.65 కోట్ల మేర (2.23 లక్షల కేసుల్లో) అధికంగా ట్యూషన్ ఫీజును మంజూరు చేసిందని వెల్లడైంది.

కాలేజీలు అందజేసిన సమాచారం ఆధారంగా ఈపాస్ వ్యవస్థలో వాటి వర్గీకరణను మార్పు చేయడం జరిగిందనీ, అధికంగా మంజూరీలనిచ్చిన చోట్ల రికవరీలు చేస్తామనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది. కాలేజీ వర్గీకరణను మార్చినప్పటికీ, మొదట్లో ఇచ్చిన మంజూరీలను సవరించలేదనీ, ఫలితంగానే అధిక విడుదల జరిగిందనీ ఆడిట్ తన పరిశీలనలో గమనించింది.

ఈపాస్ వ్యవస్థలో కాలేజీల వర్గీకరణను సరిజేయడం వాస్తవమైనప్పటికీ, అందుకనుగుణంగా డేటాబేస్ కూడా ఎప్పటికప్పుడు అప్‌డేట్ కాకపోవడం వలన మంజూరీ వివరాల్లో సవరణలు జరగలేదు. ఈ కారణంగా, ప్రభుత్వ సమాధానం అంగీకారయోగ్యం కాదు.

## 3.6.4 మంజూరీకి మించి ఆర్‌టీఎఫ్, ఎమ్‌టీఎఫ్‌లను విడుదల చేయడం

ఆర్‌టీఎఫ్, ఎమ్‌టీఎఫ్ మొత్తాలను అనేక సందర్భాల్లో మంజూరు చేసిన దానికంటే అధికంగా విడుదల చేసారని గమనించడం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.


పట్టిక 3.10

| సంవత్సరం | స్కాలర్‌షిప్ | విద్యార్థుల సంఖ్య | మంజూరైన మొత్తం | విడుదల చేసిన మొత్తం | మంజూరీకి మించి అధికంగా విడుదల చేసిన మొత్తం |
|---|---|---|---|---|---|
| | | | (₹ లక్షల్లో) | | |
| 2008-09 | ఆర్‌టీఎఫ్ | 35572 | 423.08 | 584.53 | 161.45 |
| | ఎమ్‌టీఎఫ్ | 48 | 0.72 | 1.33 | 0.61 |
| 2009-10 | ఆర్‌టీఎఫ్ | 33964 | 2229.08 | 3067.62 | 838.54 |
| | ఎమ్‌టీఎఫ్ | 4133 | 119.92 | 175.39 | 55.47 |
| 2010-11 | ఆర్‌టీఎఫ్ | 79 | 5.77 | 8.68 | 2.91 |
| | ఎమ్‌టీఎఫ్ | 41 | (-) 0.42 | 0.00 | 0.00 |
| 2011-12 | ఆర్‌టీఎఫ్ | ——— అధికంగా చెల్లించలేదు ——— | | | |
| | ఎమ్‌టీఎఫ్ | 82 | (-) 0.91 | 1.32 | 2.23 |
| మొత్తం | | | | | **1061.21** |

మంజూరీకి మించి అధికంగా విడుదల చేసిన సందర్భాలు లేవని ప్రభుత్వం తన లిఖితపూర్వక సమాధానంలో తెలిపింది. ఐతే, ఆడిట్ లేవనెత్తిన అంశాలను పరిశీలించి, దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వం హామీ ఇచ్చింది.

### 3.6.5 అర్హత పరిశీలన, స్కాలర్‌షిప్ మంజూరీ

ప్రభుత్వం పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల చెల్లింపుకు విద్యార్థుల అర్హతను నిర్ధారించడానికి నిర్దేశించిన విధానం, అర్హత పరిశీలన బాధ్యతను నిర్వహించే అధికారులను ఈ కింద చూపడమైంది.




#### *3.6.5.1 పరిశీలనాధికారులు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులను పరిశీలించడంలో తగిన శ్రద్ధను చూపకపోవడం*

ప్రభుత్వం సమయానుసారంగా జారీ చేసిన ఆదేశాల ప్రకారం, ప్రత్యక్షంగా స్కాలర్‌షిప్ దరఖాస్తులను, ప్రమాణ పత్రాలనూ పరిశీలించే బాధ్యతను జిల్లా కలెక్టర్లు గుర్తించిన పరిశీలనాధికారులు నిర్వహించాలి. తద్వారా అతి తక్కువ జాప్యంతో స్కాలర్‌షిప్‌లను అసలైన విద్యార్థులకు అందేలా చూడాలి.

ఐతే, స్కాలర్‌షిప్ దరఖాస్తులను పరిశీలించడంలో, *అనుబంధం-3.2* లో వివరించిన విధంగా తగిన శ్రద్ధను చూపలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది.

దరఖాస్తుల పరిశీలనకు నిర్దేశించిన నియమాలను నిష్కర్షగా పాటించేలా పరిశీలనాధికారులకు విపులమైన సూచనలను జారీచేయడం జరిగిందని ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి).

#### *3.6.5.2 మేనేజ్‌మెంట్ కోటా కింద చేరిన విద్యార్థులకు నియమ విరుద్ధంగా చెల్లింపులు*

2010 సెప్టెంబరు నాటి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, మేనేజ్‌మెంట్ కోటాలో చేరిన, స్పాట్ అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకానికి అర్హులుకారు. ఇదివరకే వారికి ఒకవేళ స్కాలర్‌షిప్‌ను మంజూరు చేసి ఉంటే, ఆ మొత్తాలను రికవరీ చేసేలా చర్యలను తీసుకోవాలి. ఐతే, సంక్షేమ శాఖలు ఈ ఉత్తర్వులను పాటించలేదు.

**పట్టిక 3.11 (₹ లక్షల్లో)**

| శాఖ | విద్యార్థుల సంఖ్య | 2009-10 | | మొత్తం |
|---|---|---|---|---|
| | | ఆర్‌టీఎఫ్ | ఎమ్‌టీఎఫ్ | |
| సాంఘిక సంక్షేమం | 102 | 50.88 | 11.00 | 61.88 |
| గిరిజన సంక్షేమం | 126 | 71.66 | 14.94 | 86.60 |
| బీసీ సంక్షేమం | 523 | 231.55 | 35.38 | 266.93 |
| ఈబీసీ | 472 | 201.38 | 0.78 | 202.16 |
| మొత్తం | 1223 | 555.47 | 62.10 | 617.57 |

*మూలం : ఏపీఎస్‌సీహెచ్ఈ ఇచ్చిన సమాచారాన్ని ఆడిట్ ఈపాస్ దరఖాస్తులతో పోల్చిచూసింది*


మచ్చుకు ఎంపిక చేసుకున్న జిల్లాల్లోని ఆయా శాఖల జిల్లా సంక్షేమ అధికారుల రికార్డులను ఆడిట్ పరిశీలించగా, 2009-10 సంవత్సరానికి ఇంజనీరింగ్/ఎమ్‌బీఏ/ఎమ్‌సీఏ/బీఎడ్ కోర్సులలో మేనేజ్‌మెంట్ కోటా కింద చేరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను మంజూరు చేసారని వెల్లడైంది. మేనేజ్‌మెంట్ కోటా కింద అడ్మిషన్లు పొందిన విద్యార్థులు, వారికిచ్చిన స్కాలర్‌షిప్ మొత్తాల వివరాలు పట్టిక 3.11 లో ఉన్నాయి. ఐతే, నియమ విరుద్ధంగా చెల్లించిన ఆ మొత్తాలను 2012 సెప్టెంబరు నాటికి కూడా ఇంకా రికవరీ చేయలేదు.

మేనేజ్‌మెంట్ కోటా విద్యార్థులకు నియమ విరుద్ధంగా స్కాలర్‌షిప్ మంజూరు చేయడాన్ని అంగీకరిస్తూనే, 2011-12 వరకూ ఈపాస్ వ్యవస్థలో సాధారణ ప్రవేశపరీక్ష (సెట్) క్రమబద్ధీకరణ స్వయంచాలితంగా (ఆటోమేటిక్) జరగకపోవడమే ఇందుకు కారణమని ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి). సంబంధిత కాలేజీలు, విద్యార్థుల నుండి ఆ మొత్తాలను రికవరీ చేయడానికి జిల్లా అధికారులకు సూచనలిచ్చామని కూడా పేర్కొంది.


### *3.6.5.3 ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా నిర్వహణ చార్జీలను పూర్తిగా మంజూరు చేయడం*

ఉచిత భోజన, వసతి సదుపాయాలను పొందుతున్న ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్యార్థుల విషయంలో నిర్వహణ చార్జీల రేట్లలో 1/3 వంతు మాత్రమే చెల్లించాలని పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి భారత ప్రభుత్వ మార్గదర్శకాలు (2003) నిర్దేశిస్తున్నాయి. ఐతే, ఈ నిర్దేశనలను రాష్ట్ర ప్రభుత్వం పాటించలేదు. ఈపాస్‌లోని సమాచార విశ్లేషణలో, 2008-10 మధ్యకాలంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, ఏపీటీడబ్ల్యూఆర్‌జేసీ లకు సంబంధించి సంక్షేమ శాఖలు అర్హతకు మించి అధికంగా **₹ 13.99 కోట్లను** చెల్లించాయని వెల్లడైంది.

**చార్టు - 3.5**
*అధికంగా చెల్లించిన నిర్వహణ చార్జీలు (స్థూల రూపం)*




**చార్టు - 3.6**
*ఎంపిక చేసుకున్న జిల్లాల్లో అధికంగా చెల్లించిన నిర్వహణ చార్జీలు*




ఆడిట్ ఈ విధమైన అధిక చెల్లింపును వెల్లడించిన మీదట, గిరిజన, సాంఘిక సంక్షేమ కమీషనర్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, ఏపీటీడబ్ల్యూఆర్‌జేసీ లకు చెందినవారి విషయంలో 2010-11 సంవత్సరం నుండి చెల్లింపులను నిలిపివేయాలని జిల్లా సంక్షేమ అధికారులకు సూచనలనివ్వడం జరిగింది (2011 ఫిబ్రవరి).

ఈపాస్‌లో ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, ఏపీటీడబ్ల్యూఆర్‌జేసీ లకు చెందినవారి దరఖాస్తుల దాఖలును నిలిపివేసామని ప్రభుత్వం తెలిపింది.

### *3.6.5.4 తిరుమల తిరుపతి దేవస్థాన కాలేజీలకు నియమ విరుద్ధంగా స్కాలర్‌షిప్‌ల విడుదల*

చిత్తూరు జిల్లాలో తిరుమల తిరుపతి దేవస్థాన పాలనాధీనంలో అనుబంధ హాస్టళ్లను కలిగిఉన్న ఎనిమిది కాలేజీలకు (ఈ హాస్టళ్లలో ఉచిత భోజన సదుపాయాన్ని దేవస్థానమే కల్పిస్తుంది) చెందిన 21,665 మంది విద్యార్థులకు సంబంధించి ₹2.93 కోట్లు మాత్రమే విడుదల చేయాల్సి ఉండగా, ₹8.78 కోట్లను విడుదల చేసారు. **2012 ఫిబ్రవరి నాటికి కూడా ఈ మొత్తం వార్డెన్ల ఖాతాల్లోనే పడిఉంది.**

ఆడిట్ పరిశీలనను ప్రభుత్వం అంగీకరిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థాన పరిధిలోని కాలేజీ హాస్టల్ విద్యార్థుల విషయంలో మార్గనిర్దేశనలను వర్తింపజేసేలా ఈపాస్ వ్యవస్థలో తగిన మార్పులు చేస్తామని ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి).

### 3.6.5.5 మైనారిటీ వర్గాల విద్యార్థులకు తక్కువ స్కాలర్‌షిప్‌ను మంజూరు చేయడం

రాష్ట్ర ప్రభుత్వం 2008-09 సంవత్సరం నుండి, మైనారిటీ వర్గాల విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్ రేట్లను వెనుకబడిన తరగతుల విద్యార్థులకు వర్తించే రేట్లకు సమానంగా పెంచింది (2006 డిసెంబర్). ఐతే, మైనారిటీల సంక్షేమ శాఖ ఈ పెంచిన రేట్లను వర్తింపజేయలేదు. ఫలితంగా, 2008-11 మధ్యకాలంలో మైనారిటీ వర్గానికి చెందిన 3,37,689 విద్యార్థులు ₹2.70 కోట్ల మేర (2008-09: ₹98.08 లక్షలు/1,22,604 విద్యార్థులు, 2009-10: ₹84.36 లక్షలు/1,05,454 విద్యార్థులు, 2010-11: ₹87.71 లక్షలు/1,09,631 విద్యార్థులు) స్కాలర్‌షిప్ నష్టపోయారు.

ప్రభుత్వం 2006 డిసెంబరులోని తన ఆదేశాలను అమలు చేయకపోవడానికి సంబంధించి నిర్దిష్టమైన వివరణను ఇవ్వలేదు.

### 3.6.5.6 ప్రత్యక్ష తనిఖీని నిర్వహించకపోవడం

- అర్హులైన అభ్యర్థుల నందరినీ సంవత్సరంలో రెండుసార్లు (అంటే కాలేజీలు తెరిచిన నాటినుండి నెలలోపు మొదటిసారి, అడ్మిషన్లు పూర్తయిన తేదీనుండి నెలలోగా రెండవసారి) ప్రత్యక్షంగా పరిశీలించాలని ప్రభుత్వ ఉత్తర్వులు[20] పేర్కొంటున్నాయి. ఐతే, ఈ ఆదేశాలకు విరుద్ధంగా క్షేత్ర స్థాయిలో అధికారులు సంవత్సరంలో ఒకేసారి అంటే కాలేజీలు తెరిచిన తరవాత మాత్రమే ప్రత్యక్ష పరిశీలనను చేస్తున్నారు. రెండవ విడత పరిశీలనను 2008-09 నుండి 2010-11 మధ్యకాలంలోని ఏ సంవత్సరమూ నిర్వహించలేదు. ప్రభుత్వం మాత్రం ఆదేశాల కనుగుణంగానే ప్రత్యక్ష పరిశీలనను నిర్వహిస్తున్నామని వాదించింది (2013 ఫిబ్రవరి). ఐతే, దీనిని ఎంపిక చేసిన జిల్లాల్లో మచ్చుకు చేసిన తనిఖీ ధృవీకరించడంలేదు.

- గిరిజన సంక్షేమ శాఖ 2009-10, 2010-11 సంవత్సరాలకు గాను రాష్ట్రం వెలుపల చదువుకుంటున్న ఖమ్మం, రంగారెడ్డి, విశాఖపట్నం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలకు చెందిన విద్యార్థులకు ₹9.10 లక్షల మొత్తాన్ని మంజూరు చేసింది. ఐతే, ఈ విద్యార్థులను ప్రత్యక్షంగా లేదా మరే ఇతర విధంగానైనా పరిశీలించకుండానే మంజూరీలనివ్వడం జరిగింది. ఆడిట్ కనుగొన్న అంశాలను ప్రభుత్వం ఆమోదించి, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేస్తామని వాగ్దానం చేసింది.

- ఇంటర్మీడియేట్ విద్యా బోర్డు తగిన పరిశీలనలను నిర్వహించి ఇంటర్మీడియేట్ విద్యార్థుల జాబితాను కంప్యూటరీకరిస్తున్న దృష్ట్యా, సాంఘిక సంక్షేమ కమీషనర్ సూచనల మేరకు, ఇంటర్మీడియేట్ కాలేజీ విద్యార్థులను శాఖాపరమైన పరిశీలనాధికారులు ప్రత్యక్షంగా నిర్ధారించుకొనే ప్రక్రియను ప్రభుత్వం 2011 డిసెంబరు నుండి ఆపేసింది. ఐతే, కులం, ఆదాయ ధృవీకరణల పరిశీలనలతోపాటుగా పరిశీలనాధికారులు నిర్వర్తించాల్సిన వివిధ విధులను ఇంటర్మీడియేట్ విద్యా బోర్డు నిర్వహించదు కనుక అర్హతలేని, బోగస్, కాలేజీని విడిచిపెట్టేసిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ మొత్తాలు జమ అయ్యే ఆస్కారం లేకపోలేదు. అలాంటి ఒక సందర్భాన్ని ఆడిట్ గుర్తించింది. రంగారెడ్డి జిల్లా, కూకట్‌పల్లిలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల (కోడ్ సంఖ్య 15231) లో 100 మంది ఇంటర్మీడియేట్ (మొదటి, రెండవ సంవత్సరం) విద్యార్థులకు, వారు ఆ

[20] సాంఘిక సంక్షేమ (విద్య 2) శాఖ జీఓ ఎమ్ఎస్ నెం.143, తేది 2008 జూలై 15

కళాశాలలో చేరనప్పటికీ/చదువుతూ ఉండనప్పటికీ స్కాలర్‌షిప్‌ను మంజూరు చేసారు. కాబట్టి, శాఖాపరమైన అధికారులు విద్యార్థులను ప్రత్యక్షంగా నిర్ధారించే విధానాన్ని తొలగిస్తూ తీసుకున్న నిర్ణయం సరికాదు.

అలాంటి కేసులేవీ లేవని ప్రభుత్వం సమాధానమిచ్చినా, వారి తనిఖీలో అలాంటి కేసులను కనుగొన్న సందర్భాలున్నాయని సమీక్షానంతర సమావేశంలో అంగీకరించింది.

### 3.6.5.7 విద్యార్థుల హాజరును నిర్ధారించుకోకుండానే స్కాలర్‌షిప్‌ను మంజూరు చేయడం

ప్రభుత్వ ఉత్తర్వుల[21] ప్రకారం (2008 జూలై), ప్రతి త్రైమాసం చివరకు హాజరు 75 శాతం కంటే తక్కువ ఉన్న విద్యార్థుల జాబితాను ఆయా విద్యా సంస్థల అధిపతులు సంబంధిత సంక్షేమ శాఖల జిల్లా అధికారులకు పంపించాలి. అటువంటి విద్యార్థులకు తరువాత త్రైమాసంలో స్కాలర్‌షిప్ అందకుండా జిల్లా అధికారులు చూసుకోవాలి. ఇందుకోసం, కాలేజీలలో విద్యార్థుల హాజరును తరచూ సంబంధిత జిల్లా అధికారులు, క్షేత్ర స్థాయి అధికారులు (పరిశీలనాధికారులు) తనిఖీ చేస్తుండాలి.

ఐతే, పై విధానాన్ని పాటించడం లేదు. ఎంపిక చేసుకున్న జిల్లాల్లోని ఏ ఒక్క జిల్లా సంక్షేమాధికారీ హాజరు తక్కువ ఉన్న విద్యార్థుల రికార్డును గానీ, చదువు ఆపేసిన విద్యార్థుల నెలవారీ జాబితానుగానీ నిర్వహించడం లేదు. కాబట్టి, చదువు ఆపేసిన వారికీ, కాలేజీ కి సక్రమంగా హాజరుకాని వారికీ జిల్లా సంక్షేమాధికారులు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను, ఆర్‌టీఎఫ్‌ను మంజూరు చేసి ఉండేందుకు అన్ని విధాలా అవకాశముంది.

విద్యార్థుల హాజరు నిర్ధారణ, ధృవీకరణల బాధ్యత సంబంధిత విద్యా సంస్థల అధిపతులదేనని ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి). ఐతే, నియత రీతిన జిల్లా అధికారులు, పరిశీలనాధికారులు విద్యార్థుల హాజరును తనిఖీ చేయాలని నిర్దేశిస్తూ జారీ చేసిన 2008 ఫిబ్రవరి నాటి ప్రభుత్వ సూచనలను ఈ సమాధానం పరిగణనలోకి తీసుకోలేదు.

### 3.6.5.8 పెండింగులో ఉన్న దరఖాస్తుల పరిశీలన

ఈపాస్ వ్యవస్థలో వచ్చిన దరఖాస్తులను ఆడిట్ విశ్లేషించగా, 2012 ఏప్రిల్ నాటికి, పరిశీలనకు నోచుకోకుండా భారీగా దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని వెల్లడైంది. వివరాలు ఇలా ఉన్నాయి :

పట్టిక 3.12

| సంవత్సరం | మొత్తం దరఖాస్తులు | కళాశాల వద్దపరిశీలనకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు | కళాశాల నుండి పరిశీలనాధికారికి ఇంకా పంపాల్సిన దరఖాస్తులు | పరిశీలనాధికారి స్థాయిలో పరిశీలనకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు | జిల్లా సంక్షేమ అధికారి వద్ద మంజూరీకి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు |
|---|---|---|---|---|---|
| 2008-09 | 1540550 | శూన్యం | శూన్యం | 261331 | 34971 |
| 2009-10 | 2456261 | 17 | 4688 | 3960 | 5611 |
| 2010-11 | 2446265 | 77802 | 3580 | 32723 | 9208 |
| 2011-12 | 2528563 | 188364 | 37483 | 65301 | 408574 |

ఆ విధంగా వివిధ స్థాయిల్లో దరఖాస్తులు భారీగా పెండింగులో ఉండిపోవడంతో, అర్హులైన విద్యార్థులు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పొందలేకపోయారు.

దరఖాస్తులు పరిశీలనకు నోచుకోకుండా మిగిలిపోవడాన్ని ప్రభుత్వం అంగీకరిస్తూనే, అర్హులైన విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్‌ను మంజూరు చేసామనీ, ఎవరికీ స్కాలర్‌షిప్‌ను నిరాకరించడం జరగలేదనీ ప్రభుత్వం పేర్కొంది. 'సంతృప్తత ప్రాదిపదికన' (సాట్యురేషన్ బేసిస్) స్కాలర్‌షిప్‌ల నివ్వడం వాస్తవమే అయినా, దరఖాస్తుల పరిశీలన

[21] సాంఘిక సంక్షేమ (విద్య 2) శాఖ జీఓ ఎమ్ఎస్ నెం.143 లోని పాయింట్ 9.17 ప్రకారం, తేది 2008 జూలై 15

పెండింగులో ఉన్న కారణంగా విద్యార్థులు స్కాలర్‌షిప్ సమయానికి పొందలేక పోయారన్నదే ఆడిట్ వాదన. ఇందుకు సంబంధించి ఉప సంచాలకులు (గిరిజన సంక్షేమం), జిల్లా గిరిజన సంక్షేమ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తామని గిరిజన సంక్షేమ శాఖ హామీనిచ్చింది.

### *3.6.5.9 విద్యార్థులకు ఎమ్‌టీఎఫ్‌ను నిరాకరించడం*

- విద్యార్థుల బ్యాంకు ఖాతాల పరిస్థితిపై 2008-2011 మధ్యగల మూడేళ్లకు సంబంధించిన ఈపాస్ సమాచారాన్ని విశ్లేషించగా 37,57,514 బ్యాంకు ఖాతాల్లో 2,79,790 (7 శాతం) ఖాతాలకు బ్యాంకు ఖాతా నెంబరు, ఐఎఫ్ఎస్సీ కోడ్‌ల మధ్య పొంతన లేకపోవడం (32,580 కేసులు), చెల్లని బ్యాంకు ఖాతాలు (1,74,890 కేసులు), ఖాతాలు రూఢీకాకపోవడం (72,320 కేసులు) మూలంగా నిర్వహణ ఫీజును (ఎమ్‌టీఎఫ్) జమచేయలేదని వెల్లడైంది.

- ప్రభుత్వ ఉత్తర్వుల (2011 ఫిబ్రవరి) ప్రకారం, ఈజీపే కార్డులను కలిగిఉన్న విషయాన్ని ఈపాస్ వ్యవస్థలో విద్యార్థులు ధృవీకరించిన మీదటే ఎమ్‌టీఎఫ్ మొత్తాన్ని జమ చేయడానికి ఆ కార్డులు వినియోగంలోకి రాగలవు. అయితే, ఈ అంశాన్ని పట్టించుకోలేదు. 2012 అక్టోబరు నాటికి, మొత్తం 5,71,482 మంది విద్యార్థుల్లో 1,56,374 మంది (27 శాతం) తమ ఈజీపే కార్డులను ధృవీకరించకపోవడంతో వారి ఖాతాలకు నిర్వహణ ఫీజును జమ చేయలేకపోయారు.

- సంక్షేమ శాఖలు అందుకున్న మొత్తం 3,79,894 కొత్త ఏటీఎమ్ కార్డుల్లో 16,843[22] (4.43 శాతం) కార్డులను ఆ శాఖలు పంపిణీ చేయలేదని ఆడిట్ గమనించింది. ఏటీఎమ్ కార్డులను పంపకపోవడం వలన అర్హులైన ఈ 16,843 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్ నిరాకరణకు గురవ్వడమే కాకుండా, ఆ కార్డులు దుర్వినియోగమయ్యే అవకాశాన్ని కూడా తోసిపుచ్చలేము.

ఎమ్‌టీఎఫ్‌ను ఎలాంటి జాప్యం జరగకుండా విడుదల చేయడానికి సంబంధించి ఉప సంచాలకులు (గిరిజన సంక్షేమం), జిల్లా గిరిజన సంక్షేమ అధికారులకు ఖచ్చితమైన సూచనలనిస్తున్నామని గిరిజన సంక్షేమ శాఖ తెలిపింది. సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, మైనారిటీల సంక్షేమ శాఖలు మాత్రం ఇందుకు సంబంధించి నిర్దిష్టమైన వివరణ ఇవ్వలేదు.

### *3.6.5.10 ఫీజుల విషయంలో వివిధ విశ్వవిద్యాలయాల మధ్య భారీ వ్యత్యాసాలు*

వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన వేరు వేరు కాలేజీలు అందిస్తున్న కోర్సులలో ఒకే రకమైన వాటికి ఫీజుల్లో భారీగా వ్యత్యాసాలున్నాయని ట్యూషన్ ఫీజులకు సంబంధించిన ఆడిట్ విశ్లేషణలో వెల్లడైంది. ఆయా విశ్వవిద్యాలయాలు ఆమోదించిన మొత్తాలను ఈపాస్‌లోకి తీసుకొని, ఆ మొత్తాలను విద్యార్థులకు మంజూరు చేస్తున్నారు. ఫలితంగా ఒకే కోర్సుకు వేరు వేరు రేట్లతో చెల్లింపులు జరుగుతున్నాయి. ఉదాహరణకు, ఎమ్ఎస్సీ (జువాలజీ) కోర్సుకు రాయలసీమ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తం (₹20,000), అదే కోర్సుకు కాకతీయ విశ్వవిద్యాలయంలో మంజూరు చేసిన మొత్తం (₹600) కంటే 33 రెట్లు కన్నా ఎక్కువ. బీ.కాం డిగ్రీని ఉదాహరణగా తీసుకొని కోర్సు ఫీజుల్లో వ్యత్యాసాల వివరాలను *అనుబంధం-3.3* లో ఇవ్వడమైంది.

ప్రభుత్వం, ఆడిట్ పరిశీలనను అంగీకరిస్తూ, విశ్వవిద్యాలయాలతో సంబంధం లేకుండా అన్ని కోర్సులకు ఒకే విధమైన ఫీజు విధానాన్ని అమలులోకి తెచ్చే అంశాన్ని ఏపీఎస్సీహెచ్ఈ[23] క్యాబినెట్ సబ్-కమిటీ మరియు ఛైర్మన్ దృష్టికి తీసుకువెళ్లామనీ, త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామనీ తెలిపింది.

[22] 2013 జనవరి 15 నాటికి 16,406 కార్డులు

[23] ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్

## 3.7 పర్యవేక్షణ, మూల్యాంకనం

### 3.7.1 టాస్క్ ఫోర్సు (ప్రత్యేక దళం) ద్వారా పర్యవేక్షణ

మార్గ నిర్దేశకాల[24] ప్రకారం, 2008-09 ఆర్థిక సంవత్సరం నుండి పథకాల అమలును, కొత్త విధానాన్ని పర్యవేక్షించడానికి 14 మంది సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేయాలి. ఐతే, ఈ దళానికి సంబంధించి నిర్దేశనలు, నిబంధనలు, ఎప్పుడెప్పుడు సమావేశం కావాలనే అంశాలను ప్రభుత్వం విశదీకరించ లేదు. ప్రత్యేక దళం, 2012 మార్చి నాటికి, జిల్లాల్లో సమీక్షా సమావేశాలను నిర్వహించిందనీ, జిల్లా అధికారులు/ కాలేజీ యాజమాన్యంతో పథకం అమలుకు సంబంధించి భేటీ అయిందనీ తెలిపే దాఖలాలు లేవు.

ప్రత్యేక దళం సమావేశాలను నిర్వహించడం లేదన్న ఆడిట్ పరిశీలనను ప్రభుత్వం ధృవీకరిస్తూనే, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఆ దళం సభ్యులతో ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలను నిర్వహిస్తున్నారని తెలిపింది.

### 3.7.2 అంతర్గత తనిఖీ లేకపోవడం

ప్రాంతీయ కార్యాలయాలు, జిల్లా కార్యాలయాలు, విభాగీయ కార్యాలయాలు, మొదలైన వాటిని క్రమం తప్పకుండా (సంవత్సరానికి కనీసం ఒక సారైనా) సంబంధిత శాఖల అకౌంట్సు విభాగం అంతర్గత తనిఖీ చేసి నివేదిక నివ్వాలని ప్రభుత్వ ఉత్తర్వులు చెబుతున్నాయి. ఐతే, గిరిజన సంక్షేమ శాఖ మినహా, మచ్చుకు ఎంపిక చేసుకున్న జిల్లాలు/విద్యా సంస్థలు వేటిల్లోనూ అంతర్గత తనిఖీని నిర్వహించలేదు. సాంఘిక సంక్షేమ శాఖ 2010-12 లో 13 జిల్లాల్లో అంతర్గత తనిఖీ నిర్వహించామని పేర్కొన్నప్పటికీ, ఆ జిల్లాల్లోని సంక్షేమ కార్యాలయాలలో సంక్షేమ అధికారులు అంతర్గత తనిఖీ జరిగిందనడానికి రుజువుగా ఎటువంటి రికార్డులనూ ఆడిట్ ముందుంచలేదు.

### 3.7.3 సామాజిక తనిఖీ నిర్వహించకపోవడం (వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ)

పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం అమలులో పారదర్శకత, జవాబుదారీతనాన్ని రూఢీ చేసుకోవడం కోసం సుపరిపాలనా కేంద్రం సహకారంతో సామాజిక తనిఖీని చేపట్టాలని ముఖ్యమంత్రి అభిలషించారు (2008 జనవరి). ఐతే, 2012 మార్చి నాటికి కూడా అటువంటి తనిఖీలేవీ నిర్వహించలేదు. ఈ అంశాన్ని అమలుచేస్తామని ప్రభుత్వం హామీనిచ్చింది.

### 3.7.4 నిషేధానికీ, తొలగింపుకీ గురైన విద్యార్థుల రికార్డును నిర్వహించకపోవడం

మచ్చుకు ఎంపిక చేసిన జిల్లాల్లో, జిల్లా సంక్షేమ అధికారులు నిషేధానికీ, తొలగింపుకీ గురైన విద్యార్థుల రిజిస్టర్‌ను నిర్వహించడంలేదు. ఈ కారణంగా అనర్హులైన విద్యార్థులకు చెల్లింపులు జరిగే అవకాశాన్ని తోసిపుచ్చలేము. ఈ రిజిస్టర్లను నిర్వహించేలా చూస్తామని ప్రభుత్వం భరోసానిచ్చింది.

### 3.7.5 పథకాల ప్రభావం/సార్థకత

పథకానికి సంబంధించిన అన్ని అంశాలనూ అధ్యయనం చేసి పథకాన్ని మూల్యాంకనం చేసే పనిని హైదరాబాదు లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్‌కు అప్పగించామని ప్రభుత్వం తెలిపింది (2013 ఫిబ్రవరి). ఆ విధంగా మూల్యాంకనం చేసి నివేదికను సమర్పించారని (2012 ఏప్రిల్) కూడా చెప్పారు. ఐతే, నివేదికను ఆడిట్ పరిశీలనకు అందజేయలేదు.

[24] సాంఘిక సంక్షేమ (విద్య 2) శాఖ జీఓ ఎమ్ఎస్ నెం.143, తేదీ 2008 జూలై 15

మచ్చుకు ఎంపిక చేసిన జిల్లాల్లోని సంక్షేమ అధికారులకూ, రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిని పొందిన విద్యార్థులకూ నిర్దిష్టమైన ప్రశ్నావళిని ఇచ్చి తద్వారా స్కాలర్‌షిప్ పథకాల ప్రభావాన్ని ఆడిట్ మదింపుచేసింది. ఆడిట్ కనుగొన్న అంశాలను కింది పట్టికలో ఇవ్వడమైంది:

| | |
|---|---|
| కోర్సులను పూర్తి చేయడం | స్కాలర్‌షిప్ పొందిన వారందరూ కోర్సులను పూర్తి చేసారని ప్రభుత్వ శాఖ తెలిపింది. ఐతే, స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులు వారి వారి కోర్సులను పూర్తి చేసారన్న దానికి సంబంధించిన సమాచారాన్ని/డేటాను ఆడిట్ ముందుంచలేదు. |
| ఉత్తీర్ణత రేటు | లబ్ధిని పొందిన విద్యార్థుల ఉత్తీర్ణత రేటును సాధారణ విద్యార్థుల రేటుతో సరిపోల్చి చూడడం ద్వారా ఏయే అంశాల్లో విఫలమయ్యారో నిర్ధారించుకొని తగిన దిద్దుబాటు చర్యలు తీసుకొనే అవకాశం ఉంది. ఐతే, సంక్షేమ శాఖలు అటువంటి మదింపు చేయలేదు. |
| విద్యార్థుల భర్తీలో పెరుగుదల | 2008-12 మధ్యకాలంలో నిర్దిష్ట కోర్సుల్లో చేరిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థుల సమాచారం సంక్షేమ శాఖల వద్ద లేదు. ఫలితంగా కోర్సుల్లో చేరిన విద్యార్థుల సంఖ్య పెరిగిందో/తగ్గిందో నిర్ణయించే వీలులేదు. |
| చదువు కొనసాగించే విద్యార్థులు | చదువును మధ్యలోనే ఆపేసిన విద్యార్థుల సమాచారంగానీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులపై ఈ పథకాలు అనుకూల ప్రభావాన్ని చూపాయని తెలిపే సమాచారంగానీ సంక్షేమ శాఖల వద్ద లేదు. |

### *3.7.5.1 లబ్ధిదారుల సర్వే*

నమూనాకు తీసుకున్న జిల్లాల్లో ఎంపిక చేసిన కాలేజీలను ఆడిట్ బృందాలు సందర్శించి లబ్ధిదారుల సర్వేను నిర్వహించాయి. నిర్దిష్టమైన ప్రశ్నావళిని ఆన్‌లైన్ ద్వారా పంపించి కూడా లబ్ధిదారుల సర్వే చేయడం జరిగింది. ప్రయోజనం పొందిన 3,061 మంది విద్యార్థుల (ఆన్‌లైన్, మచ్చుకు ఎంపిక చేసిన కాలేజీల) నుండి వచ్చిన సమాధానాలు ఈ కింది అంశాలను వెల్లడిస్తున్నాయి :

- స్కాలర్‌షిప్‌ను ఒకటి నుండి మూడేళ్ల జాప్యాలతో పొందామని 2,009 మంది (66 శాతం) విద్యార్థులు తెలిపారు.
- దరఖాస్తులను అందజేయడంలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని 1,053 మంది (34 శాతం) విద్యార్థులు తెలిపారు.
- ప్రస్తుతం ఇస్తున్న స్కాలర్‌షిప్ మొత్తం వారి విద్యాపరమైన అవసరాలకు సరిపోవడం లేదని 1,884 మంది (62 శాతం) విద్యార్థులు తెలిపారు.
- ఇతర ఖర్చులు అంటే స్టడీ మెటీరియల్, పుస్తకాలు, ల్యాప్‌టాప్‌లను కూడా ప్రభుత్వం ఇచ్చే సహాయక గ్రాంటులో చేర్చాలని 834 మంది (27 శాతం) విద్యార్థులు తెలిపారు.
- స్కాలర్‌షిప్ మంజూరీలో సమస్యలను ఎదుర్కొంటున్నామని 651 మంది (21 శాతం) విద్యార్థులు తెలిపారు.
- ఆర్‌టీఎఫ్‌ను కాలేజీలకు ముందస్తుగా చెల్లించేలా వత్తిడి చేసారని 280 మంది (9 శాతం) విద్యార్థులు తెలిపారు.
- 460 మంది (15 శాతం) విద్యార్థులు పూర్తి స్కాలర్‌షిప్‌ను పొందలేదు.
- స్కాలర్‌షిప్ సంబంధిత సమస్యలను జిల్లా సంక్షేమ అధికారులు పరిష్కరించలేదని 171 మంది (6 శాతం) విద్యార్థులు తెలిపారు.
- కాలేజీ యాజమాన్యం ఈజీపే కార్డులను తమ వద్దే అట్టిపెట్టుకుందని 325 మంది (11 శాతం) విద్యార్థులు తెలిపారు.

లబ్ధిదారుల సర్వేలో వెల్లడైన పై ఫలితాలు, మునుపటి పేరాలలో చర్చించిన ఆడిట్ పరిశీలనలకు అనుగుణంగా ఉన్నాయి.

## 3.8 సారాంశం

*ప్రభుత్వం గత నాలుగేళ్లలో పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాలపై **₹9,369** కోట్లను ఖర్చు చేసింది. ఈ పథకాల ద్వారా ప్రతి ఏటా **25** లక్షలకు పైగా విద్యార్థులు ప్రయోజనాన్ని పొందుతున్నారు. ఐతే, స్కాలర్‌షిప్ మొత్తాన్ని చెల్లించడంలో జరుగుతున్న విపరీతమైన జాప్యాలు కాలేజీలు/విద్యా సంస్థలు విద్యార్థులను ముందస్తుగా ఫీజును చెల్లించాలని వత్తిడి చేయడానికి కారణమౌతున్నాయి. ఈ నేపథ్యంలో సుపరిపాలనా కేంద్రం అభివృద్ధిపరచి నిర్వహిస్తున్న ఈపాస్ వ్యవస్థ ద్వారా స్కాలర్‌షిప్ మంజూరీ, చెల్లింపుల లావాదేవీలను నిర్వహించే విధానంతో ఈ పథకాల అమలులో అనుకూలమైన పలు మార్పులు వచ్చాయి. ఐతే, అర్హులైన విద్యార్థులు స్కాలర్‌షిప్ మొత్తాలను పొందడానికి మూలాధారమైన ఈమెయిల్ ఐడీలు, బ్యాంకు ఖాతా సంఖ్యలు, మొబైల్ నెంబర్లు, దరఖాస్తుల ఐడీలు మొదలైన వాటికి సంబంధించి ఈపాస్ వ్యవస్థలో పలు లోపాలు కూడా ఉన్నాయి. స్కాలర్‌షిప్ మొత్తాల మంజూరు, చెల్లింపుల సమాచారం మొత్తం ఈపాస్ వ్యవస్థపైనే ఆధారపడి ఉన్న కారణంగా, అధీకృతమైన, సముచితమైన సమాచారం మాత్రమే ఈ వ్యవస్థలో పొందుపరచేలా ఈపాస్ అప్లికేషన్ తగు నియంత్రణలు కలిగి ఉండడం ఎంతో ముఖ్యం. ఈపాస్‌లో తాజా, పారదర్శక సమాచారం ఉండేలా చూసేందుకు నోడల్ డిపార్టుమెంట్ (సాంఘిక సంక్షేమ శాఖ) చొరవ చూపినప్పటికీ, మునుపటి పేరాలలో పేర్కొన్న విధంగా, ఈపాస్‌లోని అప్లికేషన్ నియంత్రణలు, ముఖ్యంగా సమాచారం సరైనదేనని నిర్ధారించే (వేలిడేషన్) నియంత్రణలు, చాలినంతగా లేకపోవడంతో వేల కొలదీ దరఖాస్తుల్లో అసందర్భమైన, అవాస్తవికమైన సమాచారాన్ని పొందుపరచే వెసులుబాటు కల్పించింది. స్కాలర్‌షిప్‌ను మోసపూరితంగా డ్రా చేసేందుకు ఇది దోహదపడొచ్చు. అంతేకాక, దరఖాస్తులను పరిశీలించడంలో అలసత్వం కారణంగా కొన్ని సందర్భాలలో స్కాలర్‌షిప్‌లను అధికరేట్లతో మంజూరు చేయడం, అర్హతలేని విద్యార్థుల కోసం స్కాలర్‌షిప్‌లను క్లెయిమ్ చేస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసే అవకాశాలు పెరిగాయి. దీంతోపాటు దరఖాస్తుల పరిశీలన భారీగా పెండింగులో ఉండిపోవడంతో అర్హులైన విద్యార్థులు స్కాలర్‌షిప్ నిరాకరణకు గురికావడం వంటివి జరిగాయి.*

*స్కాలర్‌షిప్ ప్రయోజనాన్ని పొందే విద్యార్థులు, ప్రభుత్వం మధ్య ముఖాముఖీ సంబంధం లేకుండా కాలేజీలు/ విశ్వవిద్యాలయాలు/విద్యా సంస్థల ద్వారానే స్కాలర్‌షిప్‌ను చెల్లిస్తున్నారు. చెల్లింపుల వివరాలను నోడల్ బ్యాంకు కూడా నివేదించడం లేదు. ఇందుకు సంబంధించి తీసుకున్న చర్యల ప్రభావాన్ని అంచనా వేసేందుకు ప్రభుత్వం వద్ద ఎలాంటి యంత్రాంగం లేదు. ప్రతి విశ్వవిద్యాలయం/విద్యా సంస్థ తమకు తోచిన విధంగా ఎలాంటి ప్రాతిపదిక లేకుండా ఫీజులను నిర్ణయిస్తున్నాయి. ఈ ఫీజుల్లోని అసమానతలను తొలగించి ఫీజుల రీయింబర్స్‌మెంట్ విధానాన్ని గాడిలో పెట్టడానికి బదులు ప్రభుత్వం ఆ ఫీజులకు అనుగుణంగానే స్కాలర్‌షిప్ మొత్తాలను విడుదల చేస్తోంది. ఫలితంగా ప్రభుత్వంపై ఆర్థిక భారం బహు విధాల పెరగవచ్చు. నిధులు వృథాగా ఉండిపోవడం, పథకాలను అమలుచేసే సంస్థలు నిధులను దుర్వినియోగం చేయడం, కేటాయించిన నిధులను వినియోగించకపోవడం, వాస్తవంగా నిధుల వినియోగం జరగకుండానే వినియోగ ధృవపత్రాలను జారీ చేయడం వంటి వాటితో పాటు పథకాలకు సంబంధించి ఆర్థిక నిర్వహణలో పలు లోపాలున్నాయి.*

## 3.9 సిఫార్సులు

- ప్రభుత్వం అర్హులైన విద్యార్థులందరినీ/కాలేజీలన్నింటినీ సర్వే చేసి మెయిల్ ఐడీ, బ్యాంకు ఖాతాలతోపాటు సరైన వివరాలతో డేటాబేస్‌ని అప్‌డేట్ చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం నిర్దేశించిన రూపంలోనే లబ్ధిదారులు ఆదాయ ధృవపత్రాలు సమర్పించేలా చూడాలి.

- సంబంధిత విద్యా సంవత్సరంలోనే ప్రభుత్వం సమయానుగుణంగా చాలినంత నిధుల కేటాయింపు, విడుదల జరిగేలా చూడాలి. దీనివల్ల స్కాలర్‌షిప్‌ల ప్రయోజనాన్ని విద్యార్థులు సకాలంలో పొందగలరు.

- వివిధ సంస్థల (బ్యాంకులు, కార్పోరేషన్లు, జిల్లా అధికారులు) వద్ద మిగిలిపోయిన స్కాలర్‌షిప్ మొత్తాలు ఆయా సంస్థలు వాపసు చేసేలా చూడడం కోసం తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.

- అర్హులైన విద్యార్థులు మాత్రమే నిర్ణయించిన రేట్లకు స్కాలర్‌షిప్ పొందేలా చూసేందుకు ఈపాస్ వ్యవస్థలోని వాలిడేషన్ నియంత్రణలను బలోపేతం చేయాలి. మేనేజ్‌మెంట్/స్పాట్ అడ్మిషన్ కోటాల్లో చేరిన విద్యార్థులకు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను నియమ విరుద్ధంగా మంజూరు చేయడాన్ని నివారించడానికి వీలుగా ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సెట్) సమాచారాన్ని ఈపాస్/ఎస్ఎస్‌సీ బోర్డు సమాచారంతో ముడిపెట్టాలి.

- మైనారిటీ సంక్షేమంకు సంబంధించి, 'ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' (ఓఎస్ఎమ్ఎస్)లో ప్రభావశీలమైన నియంత్రణ ఉండేలా చూడడానికి దీనిని ఈపాస్ పరిధిలోకి తీసుకురావాలి. అంతేకాకుండా, మైనారిటీ వర్గాల విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెల్లింపుల్లో జాప్యాలు, వాటి మళ్లింపులను నివారించడం కోసం వీటిని ట్రెజరీ అధీనంలోకి తీసుకురావాలి.

- వైద్య సంస్థలు అందిస్తున్న విద్యలో, కల్పిస్తున్న మౌలిక సదుపాయాల్లో నాణ్యతను ప్రభుత్వం అంచనా వేయడంతో పాటు, ఫీజు విధానాన్ని హేతుబద్ధంగా వ్యవస్థీకరించడం/ప్రమాణీకరించడం అత్యంత ఆవశ్యకం. అది జరిగే వరకూ, యూనివర్సిటీలు పేర్కొన్న వ్యయం భర్తీ చేయడానికి బదులు, వివిధ కోర్సులకుగాను నిర్దిష్టమైన మొత్తాన్ని ప్రభుత్వం ఆయా యూనివర్సిటీలు/సంస్థలకు రీయింబర్స్ చేయాలి.

- ప్రభుత్వ విద్యా సంస్థలకు ఇచ్చే ఆర్‌టీఎఫ్ మొత్తం ఎటు తిరిగీ ప్రభుత్వానికే జమ కాబడుతుంది కాబట్టి ప్రభుత్వం ఆ సంస్థలకు ఆర్‌టీఎఫ్ విడుదలచేసే విధానానికి స్వస్తి చెప్పాలి.

- స్కాలర్‌షిప్ మొత్తాల విడుదలలో ఖచ్చితత్వాన్ని నిర్ధారించుకోవడానికి వీలుగా ఈపాస్ వ్యవస్థలో పొందుపరిచిన ఫీజు వివరాలను సంబంధిత శాఖలలో తగు అధికారిచే పరిశీలన చేయించాలి.

ఈ నివేదికలో వెల్లడిచేసిన దాదాపు అన్ని ఆడిట్ పరిశీలనలనూ ప్రభుత్వం అంగీకరించింది. ఐతే, దరఖాస్తుల పరిశీలన, స్కాలర్‌షిప్‌ల మంజూరీ, వాటి విడుదల ప్రక్రియ మొత్తం లిఖిత రూపంలో (మాన్యువల్) జరిగిన నాటి నుండి ఎంతో పురోగమించి ఇటీవలి సంవత్సరాల్లో, ముఖ్యంగా 2010-11 తరవాత, ఆ మొత్తం విధానంలో ఎంతో సౌలభ్యం చోటు చేసుకుందని ప్రభుత్వం అభిప్రాయపడింది. ఆడిట్ చేసిన సిఫార్సులను కూడా సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వం అంగీకరించి, స్కాలర్‌షిప్ విధానాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చింది.